సాక్షి
అనంతపురం
ఆదివారం । 2 । ఫిబ్రవరి । 2025



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



టమాట కిలో రూ.15

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.15 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం 35.9°/16.4°

జిల్లా అంతటా శనివారం చలి వాతావరణం కొనసాగింది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ‘నైతికత -మానవతా విలువలు’ పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇంటర్ బోర్డు ఆర్‌ఐఓ వెంకటరమణనాయక్

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు శనివారం ‘నైతికత-మానవతా విలువలు’ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 146 జూనియర్ కళాశాలల్లో నిర్వహించిన పరీక్షకు 26,274 మందికి గాను 25,475 మంది హాజరయ్యారు. కన్వీనర్, ఇంటర్ బోర్డు ఆర్‌ఐఓ వెంకటరమణనాయక్ మూడు కేంద్రాలు, డీఈసీ సభ్యులు నాలుగు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులు 20 కేంద్రాలను పరిశీలించారు.

టీసీసీ-2024 సర్టిఫికెట్లు తీసుకోండి

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఏప్రిల్‌లో జరిగిన టీసీసీ-2024 డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ గ్రేడ్ టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్లు సిద్ధంగా ఉన్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. హాల్‌టికెట్‌తో పాటు ఆధార్‌కార్డ్‌తో పాత డీఈఓ కార్యాలయంలో సంప్రదించి సర్టిఫికెట్లు పొందాలని సూచించారు.

3 నెలల పింఛన్ ఒకేసారి అందజేత

- మంత్రి పయ్యావుల కేశవ్




పింఛన్ నగదు అందజేస్తున్న మంత్రి కేశవ్

విడపనకల్లు: ‘ఎన్టీఆర్ భరోసా’ పథకం కింద ప్రభుత్వం అందించే సామాజిక భద్రతా పింఛన్ నగదును లబ్ధిదారులు మూడు నెలల పాటు తీసుకోకపోయినా అంతా కలిపి ఒకేసారి అందజేస్తామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. శనివారం విడపనకల్లు మండలం పాల్తూరులో పింఛన్ల నగదు పంపిణీ కార్యక్రమంలో మంత్రి కేశవ్, కలెక్టర్ వినోద్ కుమార్ పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ ఒకటో తేదీనే పింఛన్ అందజేస్తున్నామన్నారు. పాల్తూరులో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వంద శాతం పింఛన్ అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బీవిలారాణి, గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి, ఎంపీడీఓ షకీలా బేగం, తహసీల్దార్ చంద్రశేఖర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

4న హాకీ జిల్లా జట్టు ఎంపిక

అనంతపురం: నెల్లూరులో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి సీనియర్ ఉమెన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ హాకీ చాంపియన్‌షిప్-2025 పోటీలు జరగనున్నాయి. ఇందులో పాల్గొనే జిల్లా జట్టును ఈ నెల నాలుగో తేదీన ఎంపిక చేయనున్నట్లు హాకీ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ ఎస్.అనిల్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 1996 జనవరి తర్వాత జన్మించిన వారు మాత్రమే అర్హులని, ఆసక్తి ఉన్న వారు మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఆర్డీటీ స్టేడియంలో హాజరుకావాలని కోరారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించండి



ఎరువుల తయారీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

శింగనమల: ఎరువుల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి(డీఏఓ) ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. శనివారం సాయంత్రం సి.బండమీదపల్లి సమీపంలోని స్వర్ణభూమి ఎరువుల తయారీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఎరువుల తయారీ.. స్టాక్ రిపోర్టులను ఉన్నతాధికారులకు పంపించాలని సూచించారు. ఆమె వెంట టెక్నికల్ ఏఓ బాలానాయక్, ఏఓ అన్వేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

దయ చూపని నిర్మలమ్మ



సెంట్రల్ వర్సిటీకి నిధుల్లేవ్

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం జిల్లాలో సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీని ఏర్పాటు చేశారు. జంతలూరు వద్ద శాశ్వత క్యాంపస్‌ను గతేడాది నుంచి నిర్వహిస్తున్నారు. 2018లో జేఎన్‌టీయూ అనంతపురంలో తాత్కాలిక క్యాంపస్‌ను ఏర్పాటు చేశారు. 2023-24, 2024-2025లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.112.08 కోట్లు ఖర్చు చేసినట్లు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. అయితే, 2025-26 విద్యా సంవత్సరానికి సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రత్యేకంగా నిధులు మాత్రం కేటాయించలేదు. వర్సిటీలో మరికొన్ని బ్లాక్‌లు నిర్మించాల్సి ఉంది. రోడ్ల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉన్నా నిధుల కేటాయించకపోవడం గమనార్హం. దీన్ని బట్టి చూస్తే వర్సిటీ పురోగతికి మరికొంత కాలం వేచి ఉండక తప్పని పరిస్థితి.

నిరాశ మిగిల్చిన కేంద్ర బడ్జెట్

- ఊసేలేని బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ
- వెనుకబడిన జిల్లాలో భారీ పరిశ్రమలకు కానరాని చేయూత
- సెంట్రల్ వర్సిటీ అభివృద్ధికి పైసా నిధులు కేటాయించని వైనం
- వేతన జీవులకు మాత్రమే ఊరట
- కేంద్ర బడ్జెట్‌పై మేధావుల పెదవివిరుపు

అనంతపురం: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ వెనుకబడిన రాయలసీమ, ఉమ్మడి అనంతపురం జిల్లావాసులను నిరాశ పరిచింది. ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులపై దయ చూపలేదు. వేతన జీవులకు మాత్రమే కాస్తంత ఊరటనిచ్చి.. మిగిలిన అందరినీ ఉసూరుమనిపించారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం వెనుకబడిన రాయలసీమ జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామని పేర్కొన్నా.. కేంద్ర మంత్రి దాని ఊసే ఎత్తలేదు. ఈ ప్యాకేజీ కింద ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఏటా రూ.50 కోట్ల చొప్పున 10 సంవత్సరాలకు రూ.500 కోట్ల నిధులు రావాల్సి ఉండటం గమనార్హం. ఇక.. శ్రీ సత్యసాయి జిల్లాలో ఏర్పాటు చేస్తున్న భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(‘బెల్’) కంపెనీ గురించి బడ్జెట్‌లో ప్రస్తావనే లేదు. 10 వేల మందికి ఉపాధి కల్పించాలనే ధ్యేయంగా ఏర్పాటు చేస్తున్న ‘బెల్’ స్థితిగతులపై కనీస ప్రకటన లేకపోవడంతో ప్రజలు తీవ్ర నిరాశకు లోనయ్యారు. పూర్తిగా కార్పొరేట్ అనుకూల బడ్జెట్‌గా ఉందని మేధావులు విమర్శిస్తున్నారు.

రైతులకు ఏదీ ధీమా?

బడ్జెట్‌లో మద్దతు ధరలు, రుణ మాఫీ గురించి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అసలు ప్రస్తావించనే లేదు. ఎరువుల సబ్సిడీకి నిధుల కేటాయింపులపై కూడా మాట్లాడలేదు. గతేడాదితో పోలిస్తే ప్రధాన మంత్రి ఫసల్ బీమా కేటాయింపుల్లో కోత పెట్టారు. డ్రిప్, స్ప్రింక్లర్లు, వ్యవసాయ ఉపకరణాలపై జీఎస్టీ తగ్గించకుండా మొండిచేయి చూపారు. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా ఇచ్చే పంట రుణాలను రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచారే తప్ప నేరుగా రైతులకు ప్రయోజనం చేకూర్చలేదు. దీనికితోడు ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధికి కోత పెట్టారు. రైతులకు మద్దతు ధర అంశంలో మభ్యపెట్టే రీతిలో వ్యవహరించారు. ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు చేయూతనందించే విషయంపై కనీస ప్రకటన చేయలేదు.

వేతన జీవులకు ఊరట..

మధ్య తరగతి, వేతన జీవులకు మాత్రం కేంద్ర మంత్రి తీపి కబురు చెప్పారు. కొత్త పన్ను విధానంలో రూ.12 లక్షల ఆదాయం వరకు ఎటువంటి పన్నులు చెల్లించాల్సిన అవసరం లేకుండా రిబేట్ ప్రకటించారు. మరో రూ.75 వేల స్టాండర్డ్ డిడక్షన్ కలిపితే రూ.12,75,000 వరకు పన్ను ఉండదు. దీంతో పాటు శ్లాబులు మార్చడంతో లబ్ధి చేకూరనుంది. మిగులు ఆదాయాన్ని మ్యూచువల్ ఫండ్లు, ఇతర రంగాల్లో పెట్టుబడిగా మళ్లించేందుకు అవకాశం లభిస్తుంది. జిల్లాలో 16,279 మంది పెన్షనర్లు, 45,300 మంది రెగ్యులర్ ఉద్యోగులు, 5,700 మంది కాంట్రాక్టు, 11 వేల మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు.. మొత్తంగా 87,582 మంది పనిచేస్తున్నారు. వీరితో పాటు ప్రైవేటు రంగంలో మోస్తరు వేతనాలతో పనిచేస్తున్న వారికి ఉపశమనం లభించినట్లయింది.

ప్రజా వ్యతిరేక బడ్జెట్



దేశాభివృద్ధికి అవరోధంగా మారిన ప్రపంచీకరణ విధానాలను సమీక్షించాల్సిందిపోయి ఇంకా వేగంగా అమలు చేయాలని నిర్ణయించడం గర్హనీయం. బడ్జెట్ పూర్తిగా ప్రజా వ్యతిరేకంగా ఉంది. బీహార్‌కు రూ. వేల కోట్లు కేటాయించి, మన రాష్ట్రం పేరు ప్రస్తావించకపోవడం అన్యాయం. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు ప్రతిపాదనలు చేశారు. విద్యుత్ సంస్కరణలు అమలు చేస్తే అదనపు అప్పులకు అవకాశం ఇస్తామనడం దుర్మార్గం.

– వి. రాంభూపాల్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

కొత్త పన్ను విధానంతో ఊరట



ఆదాయపు పన్నులో మార్పుల వల్ల రూ.12.75 లక్షలలోపు ఆదాయం ఉన్న మధ్య తరగతి వేతన జీవులకు ఊరట కలిగింది. పన్ను శ్లాబులను పెంచి, పన్ను రేట్లను సరళీకరించే నిర్ణయం శుభసూచికం. ఆదాయపు పన్ను చెల్లించే వారికి కొంత మిగులు లభించడంతో దేశ ఆర్థిక వ్యవస్థలో వినియోగం, పొదుపు, పెట్టుబడులు పెరగడానికి అవకాశం ఉంటుంది.

– ఎండీ బావయ్య, విశ్రాంత ఎకనామిక్స్ ప్రొఫెసర్, ఎస్కేయూ

ప్రజలను ఫూల్ చేశారు



కేంద్రం మరోసారి ఏపీని ఫూల్ చేసింది. ప్రత్యేక హోదా, ప్యాకేజీ ప్రకటించకపోవడం దారుణం. విభజన చట్టంలోని హామీలనూ విస్మరించారు. బీహార్‌కు ఫుల్‌గా నిధులు కేటాయించి.. ఆంధ్రప్రదేశ్‌ను మాత్రం పూర్తిగా విస్మరించడం దురదృష్టకరం. కడప ఉక్కు ఊసే లేకుండా పోయింది. కడప- కదిరి- ఓబుళదేవరచెరువు- గోరంట్ల- హిందూపురం రైల్వే మార్గంపై కీలక ప్రకటన చేస్తారని ఆశిస్తే నీళ్లు చల్లారు.

– బోయ గిరిజమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్

ఏడ్చినట్లు ఉంది



ఈ బడ్జెట్ ఏడ్చినట్లు ఉంది. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూపాయి బలహీనపడింది. విదేశీ పెట్టుబడులు రావడం లేదు. బీహార్‌లో ఎన్నికలు వస్తున్నాయి కనుక ఆ రాష్ట్రానికి ఎక్కువ కేటాయింపులు చేశారు. మన రాష్ట్రానికి ఆశించినంత నిధులు కేటాయించకపోగా, పోలవరం ప్రాజెక్ట్ ఎత్తును 45.72 మీటర్ల నుంచి 41 మీటర్లకు తగ్గించడం వల్ల రాష్ట్రానికి తీరని నష్టం జరుగుతుంది.

– జగదీష్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

ఏం సాధించారు బాబూ?



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగింది. వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేలా ఎలాంటి ప్రకటన చేయకపోవడం శోచనీయం. బీహార్‌కు ఒకలా, ఆంధ్రప్రదేశ్‌కు ఒకలా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయి. ఏపీకి కొత్త ప్రాజెక్టులు సాధించుకోవడంలో సీఎం చంద్రబాబు వైఫల్యం చెందారు. ఎన్డీఏ భాగస్వాములైన బాబు, పవన్ కల్యాణ్‌లు సాధించిందేంటో ఆత్మ పరిశీలన చేసుకోవాలి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలవుతున్నా ఒక్క పథకంకూడా అమలు చేయకుండా ప్రజలను నయవంచనకు గురి చేశారు.

– అనంత వెంకట్రామి రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

రాష్ట్రానికి మొండిచెయ్యి



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చెయ్యి చూపారు. ఏపీకి ఎక్కడా ప్రాధాన్యత కన్పించలేదు. రైతులు, కూలీలు, పేదలు, బడుగు, బలహీనవర్గాలకు నిరాశాజనకంగా ఉంది. ఉద్యోగులకు ఇన్‌కమ్‌ట్యాక్స్ మినహాయింపులు తప్పితే బడ్జెట్‌లో మరేదీ సంతృప్తి ఇవ్వలేదు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రయివేట్ వైపు మళ్లించడానికి పూర్తిగా దారులు తెరిచారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ కొలువుదీరిందని, అభివృద్ధి పరుగులు పెడుతుందని, పెద్ద ఎత్తున కేంద్రం నిధులు కేటాయిస్తుందనే ఊహల్లో ఉన్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లకు మోదీ సర్కార్ షాక్ ఇచ్చింది.

–వై.శివరామిరెడ్డి, ఎమ్మెల్సీ

కార్పొరేట్‌కు రెడ్ కార్పెట్



కార్పొరేట్ అనుకూలంగా, రైతులకు వ్యతిరేకంగా బడ్జెట్ ఉంది. మద్దతు ధరలు, రుణమాఫీ ప్రస్తావన లేదు. పంటల బీమాకు నిధుల కేటాయించకపోవడం నిరాశపరిచింది. వెనుకబడిన రాయలసీమ ప్రాంతానికి విభజన చట్టంలో చెప్పిన ప్రకారం నిధుల కేటాయింపు జరగలేదు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద ఇస్తున్న రూ. 6 వేలను రూ.10 వేలకు పెంచుతూ బడ్జెట్ సవరించాలి.

– ఆర్. చంద్రశేఖర్ రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

పోలవరం ఎత్తు తగ్గించేలా బాబు కుట్ర

- అడ్డుకోవాల్సింది పోయి తల ఊపుతారా?
- బాబు హామీలన్నీ నీటిమీద రాతలే
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే మెట్టు

రాయదుర్గం: ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు ఎత్తును 45.72 మీటర్ల నుంచి 41.15 మీటర్లకు తగ్గిస్తామని కేంద్రం చేసిన ప్రతిపాదనకు అడ్డు చెప్పాల్సింది పోయి లోలోన ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్రలు చేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ధ్వజమెత్తారు. శనివారం రాయదుర్గంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డితో కలసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. గతేడాది ఆగస్టు 28న కేంద్ర కేబినెట్ పోలవరం ఎత్తు తగ్గింపునకు ఆమోదముద్ర వేసినా, ఎన్డీయేలో భాగస్వాములైన టీడీపీ ఎందుకు అడ్డుచెప్పలేకపోయిందని నిలదీశారు. దీనిపై రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు. గోదావరి నుంచి బనకచెర్లకు నీరు తీసుకొస్తామనడం నమ్మశక్యంగా లేదన్నారు. హంద్రీ-నీవా కాలువ వెడల్పు చేస్తామంటూ 1995 నుంచి బాబు చెబుతున్నారన్నారు. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2012లోనే హంద్రీ-నీవా ద్వారా జిల్లాకు కృష్ణాజలాలను తీసుకొచ్చారనే విషయం గుర్తుంచుకోవాలన్నారు.

సమాధానం చెప్పాలి..

అమరావతిలో క్విడ్‌ప్రోకో కింద కొన్న భూములు బదలాయించేందుకే రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచలేదని ‘అనంత’ ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ చార్జీలు బాది అక్కడ మాత్రం ఎందుకు మినహాయింపు ఇచ్చారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యుత్, రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచి ప్రజలపై మోయలేని భారం మోపారని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వానికి చెంపపెట్టు తప్పదన్నారు. సూపర్‌సిక్స్ హామీలన్నీ అటకెక్కించడమే కాకుండా నిధుల కొరత అంటూ చేతులెత్తేస్తున్నారని దుయ్యబట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లో 50 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ రూ.4 వేలు పింఛన్ ఇస్తామని చెప్పి నేటికీ ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. ప్రతి హామీ నెరవేర్చే వరకూ చంద్రబాబును వదిలిపెట్టేది లేదన్నారు. చంద్రబాబు ఆటవిక రాజ్యంలో కొందరు ఖాకీలు టీడీపీ నాయకుల అడుగులకు మడుగులొత్తుతున్నారన్నారు. శాంతి భద్రతలు గాడితప్పినా ఎస్పీ, కలెక్టర్ చూస్తూ ఉండిపోతున్నారని విమర్శించారు. ఇసుక, మట్టి మాఫియా రెచ్చిపోయి ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నా అడ్డుకునేవారు లేరన్నారు.

అక్రమ కేసులు సహించం..

జిల్లాలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉందని, సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేలా నూతన కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు అనంత పేర్కొన్నారు. త్వరలో మండల కన్వీనర్లు, నియోజకవర్గ అనుబంధ విభాగాలు, రాష్ట్ర క్యాడర్‌లోని అన్ని పోస్టులు భర్తీ చేస్తామన్నారు. తమ పార్టీ నాయకులపై అక్రమ కేసులు, దాడులు జరిగితే సహించేది లేదని హెచ్చరించారు.

‘పోరుబాట’కు తరలిరండి

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలంటూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 5న ఫీజు ‘పోరుబాట’ కార్యక్రమం నిర్వహించ తలపెట్టామని అనంత తెలిపారు. విద్యార్థులు, విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి మద్దతు ప్రకటించాలని పిలుపునిచ్చారు. అనంతపురంలో ఉదయం 10 గంటలకు జెడ్పీ కార్యాలయం వద్ద దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం ర్యాలీగా వెళ్లి కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప తదితరులున్నారు.

మందుబాబులు పెరిగారు!

- మద్యం తాగే వారి సంఖ్యలో పెరుగుదల
- నాలుగున్నర నెలల్లో 41.49 లక్షల లీటర్ల మద్యం వినియోగం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి సర్కారు మద్యం కిక్కు బాగా ఎక్కించింది. రోజు రోజుకూ మందుబాబుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నట్టు తాజా గణాంకాలు చెబుతున్నాయి. కొత్త మద్యం పాలసీ వచ్చినప్పటి నుంచి జిల్లా పరిధిలోనే 41.49 లక్షల లీటర్ల మద్యం వినియోగమైంది. రోజుకు 30,735 లీటర్ల మద్యం తాగుతున్నారు. 9,297 లీటర్ల బీరు సేవిస్తున్నట్లు తేలింది. గడిచిన నాలుగున్నర నెలల కాలంలో రూ.336.38 కోట్ల విలువైన మద్యం అమ్ముడుబోయిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

అత్యధికంగా అనంత అర్బన్‌లోనే..

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో మరీ ఎక్కువగా మద్యం వినియోగం జరుగుతోంది. నగరంలో 135 రోజుల్లోనే రూ.116 కోట్ల విలువైన మద్యం తాగారు. ఉదయం 8 గంటల నుంచే వైన్ షాపులు తెరవడం, దీంతో పాటు కొన్నచోటే తాగే వెసులుబాటు లభిస్తుండటంతో మందుబాబులు బారులు తీరుతున్నారు. అనంతపురం, తాడిపత్రి వంటి నగరాల్లో వైన్‌షాపులు బార్‌లను తలపిస్తున్నాయంటే అతిశయోక్తి కాదు.

కుర్రకారు మొగ్గు..

మద్య సేవనానికి కొత్తగా అలవాటు పడుతున్న వారి సంఖ్య ఇటీవల పెరిగింది. ఇందులోనూ 25 ఏళ్ల యువకులు ఎక్కువగా ఉన్నారు. గడిచిన నాలుగున్నర నెలల కాలంలో 12.55 లక్షల బీర్లు వినియోగ మైతే అందులో 60 శాతం మంది యువకులే ఉన్నట్టు తెలుస్తోంది. ఆ తర్వాత వీళ్లు విస్కీ, బ్రాందీవైపు కూడా మొగ్గు చూపుతున్నారు. ఇక పల్లెల్లో మద్యానికి బానిసై రకరకాల రుగ్మతల బారిన పడుతున్నారు. ఇటీవల ఉరవకొండలో మద్యానికి బానిసైన ఓ వ్యక్తి మరణించిన విషయం తెలిసిందే. గతంలో బహిరంగ మద్యం సేవనంపై పక్కా నియంత్రణ ఉండేది. కూటమి సర్కారు వచ్చాక పట్టించుకునే వారే లేకపోవడంతో మందుబాబులు తాగుతూ తూలుతున్నారు.



నాలుగున్నర నెలల్లో జిల్లాలో మద్యం వినియోగం విలువ

డివిజన్	మద్యం వినియోగం విలువ (రూ.లలో)
అనంతపురం	116,01,54,273
గుత్తి	33,39,75,339
గుంతకల్లు	32,40,35,546
కళ్యాణదుర్గం	20,43,76,645
కంబదూరు	6,48,21,400
కణేకల్లు	12,81,66,386
రాయదుర్గం	17,73,68,326
శింగనమల	32,43,20,293
తాడిపత్రి	44,87,64,477
ఉరవకొండ	19,78,27,576

టీ కేఫ్‌లో సంతకాలు

- కదిరి సబ్ రిజిస్ట్రార్ నిర్వాకం

కదిరి టౌన్: శ్రీసత్యసాయి జిల్లా కదిరి సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు ఓ టీ కేఫ్‌లో కూర్చొని రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన కీలక ఫైళ్లపై సంతకాలు చేయడం దుమారం రేపుతోంది. వాస్తవానికి సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు ప్రస్తుతం సెలవులో ఉన్నారు. కానీ శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని ఓ టీ కేఫ్‌లో కూర్చొని కీలక ఫైళ్లపై చకచకా సంతకాలు చేశారు. ఈ ఫైళ్లను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే ఓ ఉద్యోగి అక్కడికి తీసుకెళ్లడం గమనార్హం. ప్రభుత్వం భూముల మార్కెట్ విలువలు పెంచిన నేపథ్యంలో అవి అమల్లోకి రావడానికి ముందు రోజు (శుక్రవారం) భారీఎత్తున రిజిస్ట్రేషన్లు జరిగేందుకు వీలుగా సబ్ రిజిస్ట్రార్ ఈ నిర్వాకానికి ఒడిగట్టారు. శుక్రవారం ఉమ్మడి జిల్లాలోనే గరిష్టంగా కదిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 139 రిజిస్ట్రేషన్లు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో భారీ మొత్తాలు చేతులు మారినట్లు విమర్శలు వస్తున్నాయి. ఈ విషయంపై సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులును వివరణ కోరేందుకు ‘సాక్షి’ ప్రయత్నించగా..ఆయన ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు. కార్యాలయ సిబ్బందిని అడగ్గా.. సబ్ రిజిస్ట్రార్ సెలవులో ఉన్నట్లు తెలిపారు. సెలవులో ఉన్నప్పటికీ టీ కేఫ్‌లో కూర్చొని డాక్యుమెంట్లపై సంతకాలు చేస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.



టీ కేఫ్‌లో కూర్చొని సంతకాలు చేస్తున్న కదిరి సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు

ప్రతి ఉద్యోగి బాధ్యతగా పనిచేయాలి

అనంతపురం అర్బన్: ప్రతి ఉద్యోగి బాధ్యతగా పనిచేయాలని జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. డిప్యూటీ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను ఆయన శనివారం తన చాంబర్‌లో స్వీకరించారు. ఈ సందర్భంగా శాఖ అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అసిస్టెంట్ ట్రెజరీ అధికారులు, సబ్ ట్రెజరీ అధికారులు, జిల్లా ఖజానా శాఖ సీనియర్, జూనియర్ అకౌంటెంట్లతో తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. బాధ్యతలను విస్మరిస్తే మన ద్వారా ప్రజలకు అందే సేవల్లో నాణ్యత లోపిస్తుందన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించాలన్నారు. విధి నిర్వహణలో అవినీతికి పాల్పడితే సహించబోనని స్పష్టం చేశారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. విమర్శలకు, ఆరోపణలకు తావివ్వకుండా సుహృద్భావ వాతావరణంలో పనిచేసి ఖజానా శాఖ ప్రతిష్ట పెంచాలన్నారు.

క్లుప్తంగా

వ్యవసాయ మోటార్ల దొంగలు అరెస్ట్



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

పెద్దవడుగూరు : వ్యవసాయ బోర్ల మోటార్లు అపహరించుకుపోయే దొంగలను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్ఐ ఆంజనేయులు మీడియాకు వెల్లడించారు. పామిడి మండలం రామరాజుపల్లికి చెందిన తలారి సుధీర్, గుత్తి మండలం ఎర్రగుడి గ్రామానికి చెందిన ఓబిలేసు, గుత్తికి చెందిన వన్నూరుస్వామి ముఠాగా ఏర్పడి దొంగతనాలు చేసేవారు. పామిడి, పెద్దవడుగూరు మండలాల్లో తిరుగుతూ ఎవ్వరూ లేని సమయంలో మోటార్లు అపహరించి.. అమ్ముకుని సొమ్ము చేసుకునేవారు. ఈ క్రమంలో పెద్దవడుగూరు మండలంలో దొంగతనం చేస్తూ పట్టుబడ్డారు. వీరిని విచారించగా.. పలు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించారు. ఈ మేరకు వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మచ్చా దత్తారెడ్డి మెరుపు సెంచరీ



అనంతపురం: బెంగళూరు ఎక్స్‌ప్లోజర్ మ్యాచ్‌లో అనంతపురానికి చెందిన బ్యాటర్ మచ్చా దత్తారెడ్డి మెరుపు సెంచరీ సాధించాడు. బెంగళూరులోని సంప్రసిద్ధి స్పోర్ట్స్' ఎస్టేడియో ఆధ్వర్యంలో జరుగుతున్న టోర్నీలో శనివారం బెంగళూరు మావెరిక్స్‌తో జరిగిన మ్యాచ్‌లో వైట్‌కాలర్ బ్లూ ఎలెవన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 200 పరుగుల భారీ స్కోరు చేసింది. ఇందులో బ్యాటర్ మచ్చా దత్తారెడ్డి ధాటిగా ఆడి 53 బంతుల్లో 8 సిక్సర్లు, 8 బౌండరీలతో 105 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన బెంగళూరు మావెరిక్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 142 పరుగులు చేసింది. దీంతో వైట్‌కాలర్ బ్లూ ఎలెవెన్ జట్టు పరుగులతో విజయం సాధించింది. అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన వైట్‌కాలర్ బ్లూ ఎలెవెన్ జట్టు బ్యాటర్ మచ్చా దత్తారెడ్డి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

కేబుల్ చోరీ

శింగనమల: మండలంలోని సోదనపల్లి, ఈస్ట్ నరసాపురం, మట్లగొంది గ్రామాల్లోని 15 వ్యవసాయ బోర్లకు సంబంధించిన కేబుల్ శుక్రవారం రాత్రి చోరీ అయ్యింది. బాధితులు శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత నెలలోనూ ఇదే తరహాలో ఈ గ్రామాలకు చెందిన 20 వ్యవసాయ మోటార్ల కేబుల్ చోరీ అయిన విషయం విదితమే.

కంది రైతులకు కూటమి సర్కారు ఆశ చూపి ఉసూరుమనిపిస్తోంది. మద్దతు ధర ప్రకటించినా పరిమితంగా కొనుగోలు చేస్తామని కొర్రీ విధించింది. అంతేకాదు నాణ్యత ఆధారంగా మద్దతు ధర ఇస్తామని చెప్పింది. అరకొరగా కొనుగోలు చేస్తే.. బయటి మార్కెట్, దళారుల వద్దకు వెళ్లి తక్కువ ధరకు విక్రయించుకోవాల్సిన పరిస్థితి వస్తుంది.



కంది కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

కంది కొనుగోళ్లపై కొర్రీలు

- నాణ్యత ఆధారంగా మద్దతు ధర
- అరకొరగానే పంట కొనుగోలు
- మిగిలిన పంట దళారులపాలే!

రాయదుర్గం: మార్కెట్లో పప్పు ధాన్యాల ధరలు ఆశాజనకంగా ఉండడంతో జిల్లాలో ఎక్కువ మంది రైతులు కంది సాగుపై మొగ్గుచూపారు. దీంతో మునుపెన్నడూ లేని రీతిలో అంచనాలకు మించి సాగులోకి వచ్చింది. దిగుబడి ఫర్వాలేదనిపించినా ధరలు కొంప ముంచుతున్నాయి. మార్క్‌ఫెడ్ ద్వారా జిల్లా వ్యాప్తంగా 31 మండలాల్లోనూ కంది కొనుగోలు కేంద్రాలు తెరిచి మద్దతు ధరతో కొంటామని ప్రభుత్వం చెబుతోంది. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోందని రైతులు వాపోతున్నారు.

మూడు క్వింటాళ్లలోపే కొనుగోలు

ఖరీఫ్–2024లో కంది సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. జిల్లాలో సాధారణ విస్తీర్ణం 37,366 హెక్టార్లు కాగా.. ఈసారి రికార్డుస్థాయిలో 1,03,429 హెక్టార్లలో 84,276 మంది రైతులు కంది పంట వేశారు. రైతులందరూ ఈ–క్రాప్ నమోదు చేయించుకున్నారు. హెక్టారుకు 7 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి లెక్కించినా 8.27 లక్షల క్వింటాళ్లు చేతికి రావాలి. వీటిలో సగం పంటనైనా ప్రభుత్వం మద్దతు ధరతో కొనే పరిస్థితి కనిపించడం లేదు. జిల్లాలో 70 వేల మెట్రిక్ టన్నుల కంది దిగుబడులపై అంచనాకు వచ్చిన మార్క్‌ఫెడ్ తొలి దశలో 45 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసేలా కార్యాచరణ రూపొందించింది. ప్రభుత్వ మద్దతు ధరతో కొంటామని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించింది. అక్కడికెళితే.. అనేక ఆంక్షలు విధిస్తున్నారు. హెక్టారుకు 2 లేదా 3 క్వింటాళ్లు మాత్రమే కొంటామని స్పష్టం చేస్తున్నారు. జిల్లాలో 15 కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తెచ్చారు. మద్దతు ధర కింద క్వింటా రూ.7,550తో కొనుగోలు చేస్తున్నారు. ఇందులోనూ నాణ్యత ప్రమాణాల పేరిట దడ పుట్టిస్తున్నారు. బయటి మార్కెట్లో క్వింటాలు కంది రూ.6,200 నుంచి రూ.6,500లోపే పలుకుతోంది. దీంతో కొనుగోలు కేంద్రాల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటి వరకు 230 మెట్రిక్ టన్నుల కందులు కొనుగోలు చేశారు.

ఆంక్షలపై అన్నదాతల ఆగ్రహం

కంది కొనుగోలుకు సంబంధించి మార్క్‌ఫెడ్ సంస్థ ఎనిమిది రకాల నిబంధనలు విధించింది. నవంబర్, డిసెంబర్ నెలల్లో వరుస తుపాన్లు, ఆ తర్వాత చిరు జల్లులు కురిశాయి. ఫలితంగా కొన్నిచోట్ల పంట బాగా దెబ్బతింది. దీంతో కందుల్లో నాణ్యత తగ్గింది. నాణ్యమైన పంట మాత్రమే కొనుగోలు చేస్తామంటూ మార్క్‌ఫెడ్ అధికారులు ఆంక్షలు విధిస్తుండడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం హెక్టారుకు 7 లేదా 8 కింటాళ్లు కొంటేనే న్యాయం జరుగుతుందని డిమాండ్ చేస్తున్నారు.

అమ్మడానికి ఇబ్బంది పడుతున్నాం



నేను మూడు ఎకరాల్లో కంది పంట పెట్టాను. దిగుబడి పర్వాలేదు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో కొంటున్నా అనేక ఆంక్షలు విధించడంతో ఇబ్బంది పడుతున్నాం. 2 లేదా 3 క్వింటాళ్లకే పరిమితం చేస్తే మిగిలిన ధాన్యం ఎక్కడ అమ్ముకోవాలో అర్థం కావడం లేదు. కనీసం హెక్టారకు 7 క్వింటాళ్లయినా కొనుగోలుచేయాలి. అప్పుడే రైతులకు న్యాయం చేకూరుతుంది.

– మంగమ్మ, మహిళా రైతు, ఉరవకొండ

కంది రైతుకు న్యాయం చేయాలి



కంది రైతులకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలి. హెక్టారుకు 2 లేదా 3 క్వింటాళ్లు మాత్రమే కొంటామంటే మిగిలిన కందులు ఎక్కడ అమ్ముకోవాలో రైతుకు దిక్కుతోచడం లేదు. దీన్ని అదునుగా తీసుకుంటున్న దళారులు ధర నిర్ణేతలుగా మారుతున్నారు. ఇష్టారాజ్యంగా కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.7,550 ఉంటే బయట మార్కెట్లో రూ.6,200కే అడుగుతున్నారు. రైతు కష్టాన్ని చూసి హెక్టారుకు కనీసం ఏడు క్వింటాళ్లు ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

– భోజరాజ్‌నాయక్, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్, రాయదుర్గం

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం

దిగుబడి ఆధారంగా కంది కొనుగోలు చేపట్టాం. ఆయా ప్రాంతాలను బట్టి 2 నుంచి 4 క్వింటాళ్ల వరకు అవకాశం కల్పిస్తున్నాం. హెక్టారుకు ఏడు నుంచి ఎనిమిది క్వింటాళ్లు కొనాలని రైతుల నుంచి డిమాండ్ వస్తోంది. ఈ విషయాన్ని కలెక్టర్‌తో పాటు ఆర్థిక శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లాం. రైతుకు న్యాయం చేసేలా కృషి చేస్తాం. జిల్లాలో ఇప్పటికే 15 కొనుగోలు కేంద్రాల ద్వారా 230 మెట్రిక్ టన్నుల కందులు కొనుగోలు చేశాం. రైతు ఖాతాల్లో నగదు జమచేశాం.

– పెన్నేశ్వరి, ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్, అనంతపురం

వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించాలి



మాట్లాడుతున్న కాగజ్‌ఘర్ రిజ్వాన్

అనంతపురం కార్పొరేషన్: వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించాలని వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ కోరారు. శనివారం నగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ ఒక అమెండ్మెంట్ యాక్ట్ బిల్లు రూపంలో తీసుకుని వస్తోందన్నారు. వక్ఫ్ ఆస్తులు ప్రభుత్వ ఆస్తులు కావన్నారు. అవి ప్రైవేట్ ఆస్తులు, ముస్లింలు తమ ఆస్తులతో కొంత భాగం అల్లాహ్ పేరు మీద వక్ఫ్ చేస్తారన్నారు. కేంద్రం ప్రవేశపెట్టబోతున్న వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించాలన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ సర్వే కమిషనరేట్ తీసేయాలని కొత్త వక్ఫ్ బిల్‌లో పొందుపర్చారని.. అది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిరక్షించేలా చర్యలు తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. వక్ఫ్ ఆస్తులను పరిరక్షించకపోతే సీఎం చంద్రబాబు చరిత్రహీడిగా మిగిలిపోతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి షేక్ ఖాజాపీర్, వక్ఫ్ బోర్డు మాజీ సభ్యురాలు కమర్‌తాజ్, నాయకులు గుల్జార్‌పేట్ గఫార్ పాల్గొన్నారు.

విజయ శంకర్‌బాబుకు అంతర్జాతీయ అవార్డు



అవార్డును అందుకున్న డాక్టర్ విజయ శంకర్‌బాబు

బుక్కరాయసముద్రం: రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబుకు అంతర్జాతీయ అవార్డు వరించింది. హైదరాబాద్‌లోని క్రీడాలో జనవరి 29 నుంచి 31 వరకు మెట్ట వ్యవసాయ పరిశోధనలపై అంతర్జాతీయస్థాయి సదస్సు నిర్వహించారు. వివిధ దేశాల నుంచి వర్చువల్‌గా శాస్త్రవేత్తలు, 1200 మంది విభిన్న రీతిలో అభివృద్ధి సాధించిన రైతులు హాజరయ్యారు. రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు 24 ఏళ్లుగా నేలల ఆరోగ్యం, సమగ్ర పోషణ యాజమాన్యం, తదితర మెట్ట వ్యవసాయ సంబంధిత పరిశోధనలు చేసినందుకు సదస్సులో అవార్డు అందజేశారు. ఈ అవార్డును ఐఎస్‌డీఏ ఫెలో ఇండియన్ కౌన్సిల్ అఫ్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్ వారు అంతర్జాతీయ అవార్డును భారత వ్యవసాయ పరిశోధన మండలి డైరెక్టర్ డాక్టర్ హిమాన్షు పఠాక్, ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ స్టాండ్‌ఫర్డ్ బ్లెడ్ వారి చేతులు మీదుగా స్వీకరించారు. విజయ శంకర్‌బాబును ఆచార్య ఎన్జీరంగా వ్యసాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ సత్యనారాయణ, రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం సిబ్బంది అభినందించారు.

ప్రభుత్వాస్పత్రి ఏఓ అక్రమాలపై మళ్లీ విచారణ



విచారణ నిర్వహిస్తున్న బాలాజీకుమార్ బృందం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ఏఓ రామ్‌ప్రసాద్ అక్రమాలపై మళ్లీ విచారణ జరిగింది. చిరుద్యోగులు, కార్మికులపై వేధింపులతో పాటు అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఏఓపై ఆరోపణలు రాగా.. గత నెలలో డీసీహెచ్ఎస్ ఆదేశాల మేరకు మడకశిర వైద్యాధికారి నేతృత్వంలోని ఓ కమిటీ విచారణ చేపట్టినా ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. దీంతో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు వారం క్రితం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, వైద్యశాఖ కమిషనర్ డాక్టర్ సిరిని కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ ఆదేశాల మేరకు ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రి వైద్యుడు డాక్టర్ బాలాజీకుమార్, జోన్ ఆస్పత్రి ఏఓ శైలజ తదితరులతో కూడిన కమిటీ శనివారం గుంతకల్లు ఆస్పత్రిని సందర్శించింది. ఏఓ వల్ల ఇబ్బందులకు గురైన సిబ్బందిని పిలిపించి విచారణ చేసింది. స్థానిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మహిళా సిబ్బందిని వేధించడంతో పాటు అవినీతికి పాల్పడిన ఏఓ రామ్‌ప్రసాద్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు విచారణాధికారిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

డీజిల్ దొంగల అరెస్టు



పట్టుబడిన దొంగలతో సీఐ శివగంగాధర్‌రెడ్డి

తాడిపత్రి రూరల్: లారీల్లో డీజిల్ చోరీ చేసే ముగ్గురు దొంగలను తాడిపత్రి అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ శివగంగాధర్‌రెడ్డి శనివారం మీడియాకు వెల్లడించారు. యాడికి మండలం గుడిపాడుకు చెందిన వెంకటరమణ, నంద్యాల జిల్లా సంజామల మండలం రామిరెడ్డిపల్లికి చెందిన యేసు, నాగేశ్వరరావుతో పాటు మరో నలుగురు జులాయిగా తిరిగేవారు. వ్యసనాలు తీర్చుకోవడానికి అవసరమైన డబ్బు కోసం డీజిల్ దొంగలుగా అవతారమెత్తారు. తాడిపత్రి మండలం తలారి చెరువు సమీపంలోని అదాని సిమెంట్ వద్ద ఎక్కువ సంఖ్యలో లారీలు నిలుపుతుండడం గమనించి డ్రైవర్లు నిద్రపోయాక డీజిల్ దొంగతనం చేసి.. విక్రయించిన సొమ్ముతో జల్సాలు చేయాలనుకున్నారు. ఈ మేరకు బొలెరో వాహనం బాడుగకు తీసుకుని సిమెంట్ ఫ్యాక్టరీ వద్దకు చేరుకున్నారు. శుక్రవారం రాత్రి నిలిపి ఉన్న లారీల నుంచి డీజిల్ తస్కరిస్తుండగా సెక్యూరిటీ గార్డులు పట్టుకునేందుకు ప్రయత్నించారు. వారిలో ముగ్గురు దొరకగా.. మరో నలుగురు పారిపోయారు. పట్టుబడిన వారితో పాటు బొలెరో వాహనం, 40 లీటర్ల డీజిల్ డ్రమ్మును సెక్యూరిటీ సిబ్బంది పోలీసులకు స్వాధీనం చేశారు. విచారణలో మిగిలిన నిందితుల వివరాలను చెప్పినట్లు సీఐ తెలిపారు. పరారీలో ఉన్న వారి కోసం గాలింపు చేపట్టామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి




మృతుడు రాజు

గుంతకల్లు రూరల్: నక్కనదొడ్డి టోల్‌గేట్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుత్తి మండలం అనగానదొడ్డి గ్రామానికి చెందిన రాజు (24) మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. కృష్ణమూర్తి, సోమేశ్వరి దంపతుల కుమారుడైన రాజు తాడిపత్రి సమీపంలోని గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. కృష్ణమూర్తి గ్రామంలో కేబుల్ నెట్‌వర్క్ నిర్వహిస్తున్నాడు. సెట్‌టాప్ బాక్స్‌లు కొనుగోలు చేసే క్రమంలో శనివారం సాయంత్రం ద్విచక్రవాహనంపై గుంతకల్లుకు వచ్చిన రాజు తిరిగి వెళ్లే సమయంలో నక్కనదొడ్డి టోల్‌గేట్ వద్ద అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. తలకు గాయం కావడంతో అపస్మారక స్థితిలో పడిఉన్న రాజును గుర్తించిన స్థానికులు వెంటనే గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి రాజు మృతి చెందాడు. ఇటీవల కుమార్తె.. ఇప్పుడు కుమారుడు అర్థంతరంగా ప్రాణాలు కోల్పోవడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

భార్య పుట్టింటి నుంచి రాలేదని భర్త బలవన్మరణం

రాప్తాడురూరల్: మనస్పర్ధలతో అలిగి పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి రాలేదని మనస్తాపం చెందిన భర్త బలవన్మరణానికి పాల్పడ్డాడు. అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో నివాసం ఉంటున్న బాబుల్లా (31) లగేజీ ఆటోలో ప్లాస్టిక్ సామాన్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి పావగడకు చెందిన ఖాసీంబీతో వివాహమైంది. ముగ్గురు పిల్లలు సంతానం. మద్యానికి బానిసైన బాబుల్లా తరచూ భార్య, తల్లితో గొడవపడేవాడు. బాబుల్లా వేధింపులు భరించలేక ఖాసీంబీ నెలకిందట పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆమె తిరిగి రాలేదు. దీంతో విరక్తి చెందిన బాబుల్లా శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. శనివారం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

బ్యాంకు మాజీ ఉద్యోగి ఆత్మహత్య



మృతుడు శ్రీనివాసులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పాపంపేట ఆంజనేయస్వామి గుడి సమీపంలో నివాసం ఉంటున్న బ్యాంకు మాజీ ఉద్యోగి శ్రీనివాసులు (64) ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీనివాసులు, వెంకటలక్ష్మమ్మ దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు సంతానం. పిల్లలందరికీ పెళ్లిళ్లయ్యాయి. ఇంటివద్ద భార్యాభర్తలిద్దరే ఉండేవారు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం సమీపంలోని ఓ అంగడివద్ద ఒక వ్యక్తితో సరదాగా మాట్లాడుతూ కనిపించిన శ్రీనివాసులు మొబైల్‌కు ఫోన్‌కాల్ రావడంతో 'అర్జెంట్ పని ఉంది.. మళ్లీ వచ్చి కలుస్తా'నంటూ చెప్పి అక్కడి నుంచి హడావుడిగా వెళ్లాడు. భార్యతో కాసేపు మాట్లాడి ఇంటిపైన ఉన్న గదికి చేరుకుని ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. కొద్ది సమయం తర్వాత భార్య వెళ్లి చూడగా శ్రీనివాసులు విగతజీవిగా కనిపించాడు. దీంతో ఆమె గట్టిగా కేకలు వేసింది. చుట్టుపక్కల వాళ్లు వచ్చి కిందకు దింపినా అప్పటికే ప్రాణాలు కోల్పోయాడని చెబుతున్నారు. హడావుడిగా ఆస్పత్రికి తరలించారు. మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. శ్రీనివాసులుకు వచ్చిన చివరి కాల్ ఎవరిది... ఏమి మాట్లాడారు అనే అంశంపై స్థానికులు చర్చించుకుంటున్నారు.

హెచ్చెల్సీలో గుర్తు తెలియని మహిళ మృతదేహం

ఉరవకొండ: నింబగల్లు సమీపంలోని హెచ్చెల్సీలో శనివారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. గ్రామస్తుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గుర్తు పట్టలేనంతగా మృతదేహం కుళ్లిపోయి ఉంది. మహిళను హత్య చేసి కాలువలో పడేశారా.. లేదా ప్రమాదవశాత్తు పడి చనిపోయిందా.. అన్న కోణంలో విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ జనార్దన్‌నాయుడు తెలిపారు. హెచ్చెల్సీ వద్దే మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

కేశవ్ తీరుతో సీమకు తీవ్ర అన్యాయం

- అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రమణ

అనంతపురం సెంట్రల్: హంద్రీ–నీవా ప్రాజెక్టు ఆధునీకరణ విషయంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతున్న తీరు రాయలసీమకు తీరని అన్యాయం చేసేలా ఉందని అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రమణ మండిపడ్డారు. నిజాలు వక్రీకరిస్తే చరిత్ర క్షమించదని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. హంద్రీ–నీవా విస్తరణతో 'అనంత' సస్యశ్యామలం అని చెప్పడం మంచిదే కానీ.. ప్రభుత్వ చర్యలు మాత్రం జిల్లా ప్రజలకు తీవ్ర అన్యాయం చేసేలా ఉన్నాయని ఆరోపించారు. కృష్ణానదికి ఏటా 40 రోజులు మాత్రమే వరద ఉంటుందని, ఈ లెక్కన 40 టీఎంసీలు తీసుకురావాలంటే రోజకు 11 వేల క్యూసెక్కులు తీసుకునే విధంగా కాలువ సామర్థ్యం ఉండాలని పేర్కొన్నారు. కానీ 3,850 క్యూసెక్కుల సామర్థ్యానికి కాలువ కుదించాలని చూస్తున్నారని తెలిపారు. హంద్రీ–నీవా ఫేజ్– 2 పనులకు లైనింగ్ చేయడాన్ని అన్ని రాజకీయపక్షాలూ, ప్రజా సంఘాలూ వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. దీని వలన భూగర్భ జలాలు అడుగంటిపోతాయని, చెరువులకు నీటిని తరలించే అవకాశముండదని పేర్కొన్నారు. హంద్రీ–నీవా ప్రాజెక్టు ప్రయోజనాలు దెబ్బతినేలా హెచ్చెల్సీ పరిధిలోని జీబీసీకి నీళ్లు మళ్లించాలని నిర్ణయించడం తగునా అని ప్రశ్నించారు. తుంగభద్ర, శ్రీశైలం ప్రాజెక్టుల్లో పూడిక ద్వారా నష్టపోతున్న నీటిని ఏ విధంగా తెచ్చుకోవాలనే విషయంపై ఆలోచించాలని సూచించారు. తెలంగాణ జెన్‌కో విద్యుత్ ఉత్పత్తికి శ్రీశైలం నుంచి రోజూ 15 వేల క్యూసెక్కులు తరలించడం ద్వారా జలాశయంలో నీటి మట్టం కనిష్ట మట్టానికి పడిపోతోందని, దీని వలన హంద్రీ–నీవాకు ఎక్కువ రోజులు నీటిని తీసుకునే అవకాశం లేకుండాపోతున్న విషయం తెలియదా అని నిలదీశారు. కృష్ణా బోర్డును విజయవాడకు తీసుకుపోవడాన్ని ఏ విధంగా సమర్థిస్తారని ప్రశ్నించారు. ఇటువంటి పరిస్థితుల్లో అనంత ఏ విధంగా సస్యశ్యామలమవుతోందని ప్రజలకు సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పింఛన్ల పంపిణీలో 'తమ్ముళ్ల' హడావుడి



అనంతపురంలో పింఛన్ కోసం సచివాలయానికి వచ్చిన లబ్ధిదారులు

అనంతపురం క్రైం: సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో అధికార టీడీపీ కార్యకర్తలు హడావుడి చేశారు. శనివారం పింఛన్ల పంపిణీలో సచివాలయ సిబ్బందిని సైతం పక్కనపెట్టి వారే ముందుండి డబ్బు పంపిణీ చేశారు. తమ సొంత డబ్బును అందజేస్తున్నట్టుగా వారు చేస్తున్న ఓవరాక్షన్ చూసి పలువురు ఈసడించుకున్నారు. జిల్లాలో తొలిరోజు 2,80,327 మందికి గాను 2,69,524 మందికి పింఛన్ అందజేసినట్లు డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య తెలిపారు. పింఛన్ కోసం ఎవరూ కార్యాలయాలకు వెళ్లవద్దని సూచించారు. అయితే పలుచోట్ల లబ్ధిదారులు పింఛన్ కోసం సచివాలయాలకు వెళ్లడం కనిపించింది.

త్రుటిలో తప్పిన ఘోర ప్రమాదం



విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

తాడిపత్రిటౌన్: లారీ ఢీకొన్న ఘటనలో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. విద్యుత్ తీగలు తెగి పక్కనే ఉన్న హోర్డింగ్‌పై పడటంతో బస్సులోని ప్రయాణికులు త్రుటిలో ఘోర ప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. అనంతపురం వైపు నుంచి ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు తాడిపత్రిలోకి వస్తోంది. పశువుల ఆస్పత్రి సమీపంలోకి రాగానే బైపాస్ రోడ్డునుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొనడంతో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని తాకింది. దీంతో స్తంభం విరిగిపోయింది. ఇదే సమయంలో విద్యుత్ తీగలు తెగి పక్కనే ఉన్న హోర్డింగ్‌పై పడ్డాయి. పొరపాటున బస్సుపై పడినా.. స్థానికులపై పడినా పెద్ద ప్రమాదమే జరిగేది. అనంతపురం పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

క్లుప్తంగా

బడ్జెట్‌లో ఏపీకి తీరని అన్యాయం


మేయర్ వసీం

అనంతపురం: కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి నిధులు సాధించడంలో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పూర్తిగా విఫలమయ్యారని మేయర్ వసీం సలీం అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్డీయే ప్రభుత్వంలో టీడీపీ భాగస్వామిగా ఉన్నప్పటికీ కేంద్రంపై ఎందుకు ఒత్తిడి చేయడం లేదని ప్రశ్నించారు. ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటించలేదని.. కరువు పీడిత ప్రాంతాలకు నిధులు కేటాయించకపోవడం దారుణమని పేర్కొన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను చంద్రబాబు ఢిల్లీలో తాకట్టు పెట్టారని విమర్శించారు. టీడీపీ కూటమికి 21 మంది ఎంపీలు ఉన్నా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంలో విఫలం చెందారని విమర్శించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూరు: అధికారులు, సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి పని చేయాలని మండల ప్రత్యేక అధికారి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రతాప్‌రెడ్డి సూచించారు. శనివారం మండలంలో పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ల్యాబ్, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు. ప్రజలకు సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆసుపత్రిలో ఖాళీగా వాచ్‌మెన్, రెండూ స్వీపర్ పోస్టులను భర్తీ చేయాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, అధికారులు పాల్గొన్నారు.

సేవాభావమే రోటరీక్లబ్ ధ్యేయం


బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది

అనంతపురం కల్చరల్: సేవాభావమే ధ్యేయంగా రోటరీక్లబ్ నడుస్తోందని సంస్థ అధ్యక్షుడు భవాని రవికుమార్ అన్నారు. రోటరీ క్లబ్, ఇన్నర్‌వీల్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక అనంతపురం క్లబ్ ప్రాంగణంలో శనివారం ఉచిత గుండె వైద్య శిబిరం జరిగింది. భవానీ రవికుమార్ నేతృత్వంలో పలువురు డాక్టర్లు వందలాది మంది వృద్ధులకు ఉచితంగా గుండె పరీక్షలు, 2డీ ఎకో పరీక్షలు, ఈసీజీలతో పాటూ మందులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ చేస్తున్న సేవలకు అనేక హాస్పిటల్స్ వారు స్పందించి ఉచితంగా డాక్టర్లను పంపించడం ఆనందంగా ఉందన్నారు. వైఎస్సార్ జిల్లాకు చెందిన రోటరీక్లబ్ వారు అనంతకు వ్యాన్‌ను ఉచితంగా అందించారని తెలిపారు. అదేవిధంగా పలువురు ఇన్నర్‌వీల్ ప్రెసిడెండ్ జయంతి, ప్రతినిధులు రోటరీక్లబ్ ద్వారాసాగుతున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ గల్లా హర్ష, కేశవరెడ్డి, మేడా రామలక్ష్మి, మేడా అరవింద్, శాంతరాజు, న్యాయవాది మల్లారెడ్డి, శ్వేతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి స్కాన్ సెంటర్ల నిర్వాహకులకు హెచ్చరించారు. శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో వివిధ స్కాన్ సెంటర్ల నిర్వాహకులకు లింగ నిర్ధారణ చట్టంపై అవగాహన కార్యక్రమం కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఈ చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో చట్టాన్ని అతిక్రమించి, లింగ నిర్ధారణకు పాల్పడితే ఉపేక్షించమని హెచ్చరించారు. స్కాన్ సెంటర్‌ను సీజ్ చేయడంతో పాటు సదరు నిర్వాహకులపై కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం కర్నూలు ట్రైనింగ్ సెంటర్ నుంచి వచ్చిన నాగరాజు పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, నగర డీఎస్పీ శ్రీనివాసులు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ యుగంధర్, డాక్టర్ అనుపమ జేమ్స్, డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ రవిశంకర్, డెమో త్యాగరాజు, డిప్యూటీ హెచ్ఈఓ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

యమ డేంజర్..

- ప్రమాదకరంగా మలుపులు
- కనిపించని స్పీడ్ బ్రేకర్లు, సూచికల బోర్డులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు


కందుకూరు వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు

రాప్తాడు: మండలంలోని ప్రధాన రోడ్లపై ఉన్న మలుపులు మృత్యు పిలుపులుగా మారాయి. ఆయా ప్రదేశాల్లో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలు గాలిలో కలవడం ఖాయం. లేదంటే వికలాంగులుగా మారక తప్పదు. ఈ రోడ్లపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు వాటి నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఏళ్లు గడుస్తున్నా ఈ మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో వాహన చోదకులు అయోమయానికి గురవుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రాప్తాడులో 44వ జాతీయ రహదారిపై నాలుగు రోడ్ల కూడలిలో వందలాది మంది గాయాలపాలయ్యారు. రోడ్డు దాటుతూ పలువురు మృత్యువాత పడ్డారు. అలాగే హంపాపురం గ్రామ రోడ్డుపై కూడా గాయపడి మృతి చెందిన వారు ఉన్నారు. మరూరు గ్రామం వద్ద కూడా రోడ్డు దాటే క్రమంలో పదుల సంఖ్యలో మృతి చెందారు. గత ఏడాది యర్రగుంట గ్రామ సమీపంలో అనంతపురంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన స్కూల్ బస్సు బోల్తాపడటంతో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. మలుపులు ఉన్న చోట అధికారులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకుండా వేరే ప్రాంతాల్లో వేస్తున్నారు.

జంక్షన్లు.. ప్రమాదాలకు నిలయాలు

జంక్షన్ల వద్ద ఏమరుపాటుతో వాహనం నడిపితే ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి. ఏడో నంబర్ జాతీయ రహదారిని విస్తరించి రెండు లైన్ల రహదారిగా ఏర్పాటు చేసి, 44వ నంబర్ జాతీయ రహదారిగా పేరు మార్చారు. అంతేకాకుండా గ్రామాల వద్ద వాహనాలు, ఎద్దుల బండ్లు దాటుకోవడానికి కూడళ్లలో సర్కిళ్లను ఏర్పాటు చేశారు. మండలంలో 44వ జాతీయ రహదారిపై రాప్తాడు, ప్రసన్నాయపల్లి, లింగనపల్లి, రామినేపల్లి, హంపాపురం, మరూరు గ్రామాల వద్ద జంక్షన్లను ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి పనులు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు రోడ్డు దాటే క్రమంలో వాహనాలు ఢీకొనడంతో మరణించిన వారు, గాయపడిన వారి సంఖ్య దాదాపుగా 3 వేలకు పైగా చేరింది. ఇందుకు కారణం జాతీయ రహదారిపై సరైన సూచికలు లేకపోవడం, అధిక వేగం వంటి కారణాలే అని చెప్పొచ్చు.

స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటులో నిర్లక్ష్యం

నియోజకవర్గ కేంద్రం రాప్తాడు, రామినేపల్లి, హంపాపురం, మరూరు గ్రామ సమీపంలోని నాలుగు రోడ్ల కూడళ్లల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ఆయా గ్రామాల ప్రజలు అటు అధికారులు, ఇటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా ఎటువంటి ఫలితం లేదు. ఇప్పటికే ఆయా గ్రామాల సమీపంలో ఉన్న కూడళ్లల్లో పదుల సంఖ్యలో మృతువాత పడ్డారు. వందల సంఖ్యలో రోడ్డు ప్రమాదానికి గురై మంచాన పడిన వారు ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకర మలుపుల్లో స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తికమకపడుతున్నాం



రాప్తాడులో 44వ జాతీయ రహదారిపై నాలుగు రోడ్ల కూడలిలో రోడ్డు దాటాలంటే తికమకపడుతున్నాం. ఎటువైపు నుంచి ఏ వాహనం వస్తుందో తెలియడం లేదు. ఒక్క సారిగా నాలుగు వైపులా వాహనాలు వస్తే వాహనాదారులు తికమక పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికే నాలుగు రోడ్ల కూడలిలో చాలా మంది ప్రమాదాలకు గురయ్యారు. పదుల సంఖ్యలో మృతి చెందారు. నాలుగు వైపులా స్పీడ్ బ్రేకర్స్ వేసి ప్రమాదాలను నివారించాలి. – రామాంజిన రెడ్డి, రాప్తాడు

ప్రమాదాలు అరికట్టాలి



మండలంలో మలుపులు అధికంగా ఉన్నాయి. రాప్తాడు నుంచి మా గ్రామానికి వెళ్లాలంటే 20 కిలో మీటర్లు ప్రయాణించాలి. దాదాపుగా 15 మలుపులు వస్తాయి. ముఖ్యంగా గొందిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో రెండు మలుపులు చాలా ప్రమాదకరంగా ఉన్నాయి. యర్రగుంట సమీపంలో అనంతపురంకు చెందిన ఓ ప్రైవేటు స్కూల్ బస్సు బోల్తా పడి పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. అలాగే గొందిరెడ్డిపల్లి సమీపంలో ఆర్టీసీ బస్సు మలుపులో రోడ్డు పక్కనే ఉన్న గుంతలోకి దిగి లాగే నిలబడిపోయింది. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. – రాజశేఖర్ రెడ్డి, ఎం.బండమీదపల్లి

అవగాహన కల్పిస్తున్నాం



స్థానిక 44వ జాతీయ రహదారిపై ఉన్న మలుపుల వద్ద ప్రమాదాల నియంత్రణ కోసం తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. నిరంతరం వాహనాలను తనిఖీ చేస్తున్నాం. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించాం. రాత్రి వేళ ప్రమదాలు అధికంగా జరుగుతున్నాయి. మద్యం సేవించడం అతి వేగంగా వాహనాలు నడపడం, సీటు, బెల్ట్, హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. ప్రజలు రోడ్డు నిబంధనలు పాటించాలి. – శ్రీహర్ష, సీఐ, రాప్తాడు

హడలిపోతున్న వాహనదారులు


రాప్తాడులో 44వ జాతీయ రహదారిపై నాలుగు రోడ్ల కూడలి వద్ద కనిపించని స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు

ధర్మవరం పంగల్ రోడ్డు, కందుకూరు క్రాస్, గంగలకుంట క్రాస్, రాప్తాడు బస్టాండు సర్కిల్లో ఉన్న క్రాస్, రాప్తాడులో నాలుగు రోడ్ల కూడలిలో మలుపులు ప్రమాదాలకు కేరాఫ్‌గా నిలుస్తున్నాయి. లింగనపల్లి రోడ్డు క్రాస్, రామినేపల్లి బస్టాండులో ఉన్న నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న క్రాస్, హంపాపురం క్రాస్, ఎం.చెర్లోపల్లి గ్రామ క్రాస్‌ల వద్ద ప్రమాద సూచికల బోర్డులు ఏర్పాటు చేయలేదు. అనంతపురం నుంచి నాయక్‌నాగర్ మీదుగా అయ్యవారిపల్లికి వెళ్లే రహదారిలో దాదాపుగా 20 మలుపులు ఉండటంతో వాహనదారులు హడలిపోతున్నారు.

ప్లేట్, గ్లాస్ విధానానికి స్వస్తి పలకాలి


ఎస్కేయూ ప్రధాన ద్వారం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

అనంతపురం: హాస్టల్ నుంచి సుదూరంగా ఉన్న కామన్ మెస్ హాల్‌లోకి ప్లేటు, గ్లాస్ తీసుకుని వెళితే మాకు భోజనం అందిస్తున్నారు. ఈ విధానానికి స్వస్తి పలకాలని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పీజీ విద్యార్థులు డిమాండ్ చేశారు. శనివారం వర్సిటీ ప్రధాన ద్వారానికి తాళం వేసి ఆందోళన చేపట్టారు. గతంలో మూడు వేల మంది విద్యార్థులకు అక్కడే ప్లేటు, గ్లాస్‌లు ఇస్తూ ఆత్మగౌరవానికి భంగం కలగకుండా భోజనం వడ్డించేవారు. తాజాగా 300 మంది కూడా లేము. మా ప్లేట్లు మేమే కడుక్కుని హాస్టల్ నుంచి తీసుకుని వెళ్లాలా? అని ప్రశ్నించారు. నీళ్ల మజ్జిగ, నీళ్ల పప్పే మాకు గతా? అంటూ మండిపడ్డారు. నాసిరకమైన భోజనం అందిస్తూ అనారోగ్యానికి గురిచేస్తున్నారని మండిపడ్డారు. నాసిరకమైన కూరగాయలు, నాణ్యత లేని నిత్యావసర సరుకులు అందిస్తున్నప్పటికీ, నెలకు రూ.3 వేల మెస్‌బిల్లు రావడం ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న రిజిస్ట్రార్ రమేష్ బాబు విద్యార్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. పాత విధానంలోనే మెస్ నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ప్లేటు, గ్లాస్‌లు హాస్టల్ సిబ్బందే అందిస్తారన్నారు. సిబ్బందికి ప్రత్యేక డ్రెస్ కోడ్ అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ వర్సిటీ కార్యదర్శి రమణయ్య, వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకుడు హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘సంపద కేంద్రాలు’ వినియోగంలోకి తేవాలి


చెర్లోపల్లిలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి

గుత్తి రూరల్: గ్రామాల్లో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ సీఈఓ రామచంద్రారెడ్డి సూచించారు. చెర్లోపల్లి పంచాయతీలోని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని జెడ్పీ సీఈఓ శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రోజూ పోగయ్యే చెత్త నుంచి సంపద తయారు చేసి గ్రామ పంచాయతీకి ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. ప్రతి పంచాయతీలో సంపద తయారీ కేంద్రాల నుంచి వర్మీ కంపోస్టు ఎరువులు తయారు చేసి గ్రామంలోని రైతులకు తక్కువ ధరకు విక్రయించాలన్నారు. కేంద్రాల చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అప్పా వెంకటేష్, ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, ఈఓఆర్డీ శివాజీరెడ్డి, కార్యదర్శి సుమలత పాల్గొన్నారు.

‘చలో హైదరాబాద్’ విజయవంతం చేయండి

అనంతపురం టవర్‌క్లాక్: ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ తలపెట్టిన లక్ష డప్పులు, వేల గొంతులు కార్యాక్రమానికి అత్యధికంగా మాదిగలు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, అమర్‌నాథ్, కదిరప్ప, చంద్ర,నాగభూషణం, రమేష్, శీనా, బూదెప్ప, సునీత, మీసాల నాగభూషణం, నారాయణ స్వామి, ఓబులేసు, లాలెప్ప, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి శనివారం ఫిజియో థెరపీ

కనగానపల్లి: స్థానిక భవిత కేంద్రంలో ప్రతి శనివారం ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఫిజియోథెరపిస్టు చంద్రకళ తెలిపారు. శనివారం మండల విద్యాధికారిణి కే.టి. శ్రీదేవి పర్యవేక్షణలో దివ్యాంగులకు ఫిజియోథెపీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ఈ అవకాశాన్ని మండలంలోని దివ్యాంగులందరూ ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్టీ జగదీశ్వరి సిబ్బంది పాల్గొన్నారు.

‘ఫీజు పోరు’ ర్యాలీకి తరలిరండి


ఫీజు పోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డిప్యూటీ మేయర్ వాసంతి, తదితరులు

అనంతపురం కార్పొరేషన్: విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్న కూటమి ప్రభుత్వాకి బుద్ధి చెప్పడానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టబోతున్న ఫీజు పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని వివిధ కళాశాల్లో విద్యార్థులతో వారు సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వం రూ.3,900 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. కానీ ఇంత వరకు ఒక్క రూపాయి విద్యార్థులకు అందించలేదన్నారు. విద్యార్థులకు సకాలంలో రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ జాప్యంతో కళాశాలలు ఒత్తిడి చేస్తున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి నాయకత్వంలో ఈనెల 5న నగరంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జెడ్పీ కార్యాలయం వద్ద నుంచి ఉదయం 10:30 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. సప్తగిరి సర్కిల్ మీదుగా కలెక్టరేట్‌కు చేరుకుని అక్కడ కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం నగరాధ్యక్షుడు కైలాస్, మహిళా విభాగం నగరాధ్యక్షురాలు సాకే చంద్రలేఖ, వైఎస్సార్‌సీపీ నాయకులు భారతి, మహేశ్వరి, లక్ష్మి, వెంకట్, శేఖర్, అరవింద్, రాజేష్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

మాచిదేవుడి సేవలు ఆదర్శప్రాయం

అనంతపురం కల్చరల్: రజకుల ఆరాధ్యదైవం మడివాల మాచిదేవుడి సేవలు ఆదర్శప్రాయమని పలువురు కళాకారులు కొనియాడారు. శనివారం రాత్రి స్థానిక లలిత కళాపరిషత్తులో మడివాళ మాచిదేవుడి జయంతి సందర్భంగా మాచిదేవ, అన్నమయ్య పద్య నాటకాలను ప్రదర్శించారు. జిల్లా కళాకారులతో పాటూ గుడివాడకు చెందిన కళారంజని ఆర్ట్ అసోసియేషన్‌కు చెందిన సీనియర్ ట్రూపు కళాకారులు సినిమాను తలపిస్తూ మాచిదేవ, అన్నమయ్య జీవితాలకు సంబంధించిన విశేషాలను వివరించారు. అంతకు ముందు మాచిదేవుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రజక చైతన్య సంఘం ప్రతినిధులు రామచంద్ర, మల్లేష్, రాంగోపాల్, రాజశేఖర్ తదితరులు మాట్లాడుతూ.. అణగారిన రజక జీవితాలకు వెలుగులు నింపిన మహనీయుడిని స్మరించుకోవడం కర్తవ్యమన్నారు. చివరలో ‘కదిరి నృసింహుడు’ వంటి అన్నమయ్య కీర్తనలను మధురంగా ఆలపించిన సంగీత కళాకారుడు సంధ్యావందనం రామచంద్రరావు, నాటక కళాకారులను సత్కరించారు. ఎల్కేపీ కార్యదర్శి పద్మజ పాల్గొన్నారు.

నడకతో ఆరోగ్యం

అనంతపురం టవర్‌క్లాక్: జీవన శైలిలో రోజూ 30 నిమిషాలు తప్పని సరిగా నడవాలి. లేదా పరుగు తీయాలని వీ వైబ్ సంస్థ అధినేత రఘువీణ సూచించారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వీ వైబ్ సంస్థ ఆధ్వర్యంలో అనంతపురం కోసం పరుగు కార్యక్రమంలో టీ షర్టులు, వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాప్ ఈగల్ ఎలైట్ యాంటీనార్కొటిక్స్ గ్రూఫ్ ఫర్ లా ఎన్ఫోర్స్‌మెంట్ అహుడా, ఎస్ఎస్ఎస్ ఆర్ట్స్ కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం ‘అనంతపురం కోసం పరుగు’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 10కె, 5కె, 3కె పరుగు పందెంలో నగర వాసులు పాల్గొనాలని కోరారు. 10కెలో ప్రతిభ కనపరిచిన వారికి నగదు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సుధాకర్, హరికృష్ణ, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.


శాప్ చైర్మన్ రవి నాయుడుకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

అనంతపురం టవర్‌క్లాక్: శాప్ చైర్మన్ రవి నాయుడు శనివారం సాయంత్రం ఆర్అండ్‌బీ అతిథి గృహానికి చేరుకున్నారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద 10కే రన్‌ను ప్రారంభిస్తారు.

ఆకట్టుకున్న లఘుచిత్రాల ప్రదర్శన


చిత్రప్రదర్శనకు హాజరైన వివిధ ప్రాంతాలకు చెందిన లఘుచిత్రాల సమర్పకులు

అనంతపురం కల్చరల్: నగరంలోని విద్యుత్‌కళా ప్రివ్యూ థియేటర్ వేదికగా అనంతపురం ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న 7వ అనంత లఘుచిత్రోత్సవంలో శనివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు పలు ప్రాంతాలకు చెందిన లఘుచిత్రాలను ప్రదర్శించారు. ఫిల్మ్ మేకర్, డైరెక్టర్ రషీద్‌బాషా నేతృత్వంలో హైదరాబాద్ నుంచి విచ్చేసిన సినీ సాంకేతిక నిపుణులు వెంకట్ కట్టా, విజయవాడ నుంచి వచ్చిన జ్యూరీ సభ్యుడు వెంకటేశ్వరరావు 86 లఘుచిత్రాలను తిలకించారు. 18 విభాగాల్లో ఉత్తమమైన వాటిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు రషీద్‌బాషా మాట్లాడుతూ.. పెద్ద నగరాలకు పరిమితమైన లఘుచిత్రోత్సవాన్ని అనంతలో వ్యయప్రయాసల నడుమ జరిపిస్తున్నామన్నారు. ఎంతో మంది ఔత్సాహిక కళాకారులకు అవకాశం దక్కుతోందన్నారు. ఈనెల 2న అనంత కన్వెన్షన్ హాలులో ముగింపు వేడుకలు నిర్వహిస్తామని వెల్లడించారు. విజేతలకు అవార్డులు అందజేస్తామని పేర్కొన్నారు. అంతకు ముందు జిల్లా కేంద్రంతో పాటూ కళ్యాణదుర్గం, ఉరవకొండ, రాయదుర్గం తదితర చోట్ల నిర్మించిన సందేశాత్మక లఘుచిత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఫిల్మ్ సొసైటీ సభ్యులు తోట బాలన్న, టీవీ సినీనటుడు రమేష్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

అనంతపురం అగ్రికల్చర్: ఐక్యరాజ్యసమితి 2025 ఏడాదిని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిన సందర్భాన్ని పురస్కరించుకుని విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంకు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు శనివారం బ్యాంకు వర్గాలు ఒక ప్రకటన విడుదల చేశాయి. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, లయన్స్ క్లబ్ సంయుక్తంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్థానిక గిల్డ్ ఆఫ్ సర్వీసు స్కూల్‌లో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కంటికి సంబంధించి అన్ని రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి బెంగళూరుకు చెందిన శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు, నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 08554–244220, 7780647347 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నైపుణ్యాలతో ఉపాధి అవకాశాలు పుష్కలం


మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వనజా అక్కమ్మ

అనంతపురం సెంట్రల్: విద్యతో పాటు ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వనజా అక్కమ్మ పిలుపునిచ్చారు. శనివారం ఐసీడీఎస్ కార్యాలయంలో పీఎంకేర్ లబ్ధిదారులకు కెరీర్ గైడెన్స్, స్కిల్ డెవలప్‌మెంట్ అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న అమ్మాయిలు, అబ్బాయిలు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గంగాధర్ మాట్లాడుతూ.. లబ్ధిదారుల అర్హతను బట్టి వారి ప్రాంతంలో ప్రభుత్వం ద్వారా ఉపాధి అవకాశాలను కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రామలక్ష్మి, ఉమ్మడి జిల్లాల డీసీపీఓలు మంజునాథ్, మహేష్, ఐసీపీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పును వ్యతిరేకిస్తాం

అనంతపురం టవర్‌క్లాక్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో కులం పేరుతో దూషించడం అనేది నాలుగు గోడల మధ్య ఉంటే కుదరదని.. బహిరంగంగా అందరూ చూస్తుండగా దూషించాలని సుప్రీంకోర్టు చెప్పడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి అన్నారు. శనివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఎస్సీ, ఎస్టీలను ఇబ్బంది పెట్టేలా తీర్పులు ఇవ్వడం సరికాదన్నారు. దీనిపై పోరాటాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేపీ రాజు, రామకృష్ణ, ఆది, వెంకటేష్, నారాయణ స్వామి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అనంత పూర్ రోడ్డు


చెరువుకట్ట రోడ్డులో రాళ్లతో గుంతలు పూడ్చిన దృశ్యం

ఈ ఫొటోలో కనిపిస్తున్నది చెరువుకట్ట రోడ్డు. ఈ రోడ్డులో పడిన గుంతలను ఇలా పెద్ద పెద్ద రాళ్లతో కూడిన మట్టితో పూడ్చారు. మట్టిపోగా రాళ్లు బయటకు తేలి వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా మారింది. ఈ మార్గంలో వాహనాలను నడిపేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఇస్కాన్ నిర్వహిస్తున్న గోశాల వద్ద, కట్ట రోడ్డులో అక్కడక్కడ గుంతలు పడ్డాయి. ఈ గుంతలను సాంకేతిక విధానంలో కాకుండా మొక్కుబడిగా పూడ్చారు. రాళ్లు తేలిన మార్గంలో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు.

– అనంతపురం అర్బన్



సచిన్‌కు బీసీసీఐ 'జీవిత సాఫల్య' పురస్కారం

మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) 'జీవిత సాఫల్య' పురస్కారం అందజేసింది. ముంబైలో శనివారం జరిగిన బీసీసీఐ వార్షిక అవార్డుల కార్యక్రమంలో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) అధ్యక్షుడు జై షా చేతుల మీదుగా సచిన్ ఈ పురస్కారాన్ని అందుకున్నాడు. క్రికెట్లో దేశానికి అందించిన విశేష సేవలకు గుర్తింపుగా భారత తొలి కెప్టెన్ కల్నల్ సీకే నాయుడు పేరు మీదుగా 1994 నుంచి ఈ 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డును ప్రదానం చేస్తున్నారు.

పసిడి పతకం నెగ్గిన పల్లవి

డెహ్రాడూన్: జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్‌కు రెండో స్వర్ణ పతకం లభించింది. శనివారం జరిగిన మహిళల వెయిట్‌లిఫ్టింగ్ 71 కేజీల విభాగంలో సనాపతి పల్లవి పసిడి పతకం సొంతం చేసుకుంది. పల్లవి మొత్తం 212 కేజీల బరువెత్తి అగ్రస్థానంలో నిలిచింది. పల్లవి స్నాచ్‌లో 94 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 118 కేజీలు బరువెత్తింది. శుక్రవారం పురుషుల 67 కేజీల విభాగంలో నీలంరాజు ఆంధ్రప్రదేశ్‌కు తొలి బంగారు పతకాన్ని అందించాడు.





కేలా రెనెకి
నికీ ప్రసాద్

ఒకటే లక్ష్యం... రెండో ప్రపంచకప్

కౌలాలంపూర్: రెండేళ్ల క్రితం దక్షిణాఫ్రికా గడ్డపై జరిగిన మొట్టమొదటి అండర్-19 టి20 ప్రపంచ కప్‌లో భారత అమ్మాయిల జట్టు జగజ్జేతగా అవతరించింది. రెండేళ్ల తర్వాత అదే ప్రపంచకప్‌ను నిలబెట్టుకునేందుకు ఈసారి దక్షిణాఫ్రికా జట్టుతో టీమిండియా ఫైనల్ సంగ్రామానికి సిద్ధమైంది. అజేయంగా తుది పోరుకు అర్హత సాధించిన నికీ ప్రసాద్ నాయకత్వంలోని భారత అమ్మాయిల జట్టు విజయవంతంగా 'రెండో ప్రపంచకప్ మిషన్' పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉంది. భారత్ మాదిరిగానే ఓటమి లేకుండా ఫైనల్ చేరిన దక్షిణాఫ్రికా జట్టు వరల్డ్‌కప్ ముచ్చట తీర్చుకోవాలనే పట్టుదలతో ఉంది. ఈ నేపథ్యంలో జోరు మీదున్న రెండు అజేయ జట్ల మధ్య నేడు జరిగే అండర్-19 ప్రపంచకప్ టైటిల్ పోరుపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ఈసారీ భారత్ జైత్రయాత్ర కొనసాగుతుందా! లేదంటే కొత్త చాంపియన్ ఆవిర్భవిస్తుందా! మరి కొన్ని గంటల్లో తేలిపోతుంది. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ వనరులతో పూర్తిస్థాయి ఆల్‌రౌండ్ సామర్థ్యంతో ఉన్న టీనేజ్ టీమిండియాను ఎదుర్కోవడమే ఎవరికైనా అతిపెద్ద సవాల్. ఇక అలాంటి అభేద్యమైన జట్టును ఓడించాలంటే మాత్రం దక్షిణాఫ్రికా మైదానంలో పెద్ద 'ప్రపంచ' యుద్ధమే చేయాలనడంలో అతిశయోక్తి లేదు!

నేడు మహిళల అండర్-19 టి20 ప్రపంచకప్ టైటిల్ పోరు

- దక్షిణాఫ్రికాతో భారత్ 'ఢీ'
- ఓటమి లేకుండానే రెండు జట్లు ఫైనల్లోకి
- త్రిష, కమలినిలపై దృష్టి
- మధ్యాహ్నం 12 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఆ ఇద్దరిని కట్టడి చేస్తే...

తెలంగాణ స్టార్ బ్యాటర్ గొంగడి త్రిష! మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) వేలంలో తనను విస్మరించిన ఫ్రాంచైజీల కళ్లకు కట్టుకున్న గంతల్ని తన అసాధారణ బ్యాటింగ్‌తో విప్పేసింది. ఇప్పుడు 'ఫైనల్ మిషన్' ముంగిట అందరి దృష్టి ఆమెపైనే ఉంది. ఈ టోర్నీలో ఓపెనర్ త్రిష ఫామ్, క్రీజులో ఆమె కనబరుస్తున్న పోరాటపటిమ ప్రత్యర్థి బౌలర్లకు కఠిన సవాళ్లు విసురుతున్నాయి. మరో ఓపెనర్ కమలిని, సనిక చాల్కేలతో కూడిన భారత బ్యాటింగ్ విభాగం పటిష్టంగా ఉంది. దక్షిణాఫ్రికా విజయంపై ఆశలు పెంచుకోవాలంటే మాత్రం ముఖ్యంగా త్రిష, కమలినిలను తక్కువ స్కోరుకు పరిమితం చేయాల్సి ఉంటుంది. ఈ టోర్నీలో త్రిష 265 పరుగులతో టాప్ స్కోరర్‌గా ఉండగా... కమలిని 135 పరుగులతో మూడో స్థానంలో ఉంది. ఆ తర్వాత భారత్ నుంచి అత్యధిక పరుగులు సనిక చాల్కే (6 మ్యాచ్‌ల్లో 69) చేసింది. భారత బౌలింగ్ విభాగాని కొస్తే ఆయుశి శుక్లా, పారుణిక సిసోడియా, వైష్ణవి శర్మలతో కూడిన స్పిన్ త్రయం విశేషంగా రాణిస్తోంది. సహజంగానే సఫారీలకు స్పిన్ అంటేనే కష్టం. అలాంటి జట్టుపై ఫామ్‌లో ఉన్న ఈ ముగ్గురు స్పిన్నర్లు తప్పకుండా ప్రభావం చూపిస్తారు. అలాగని ఫైనల్‌కు చేరిన సఫారీ జట్టును తక్కువ అంచనా వేయలేం. కేలా రెనెకి కెప్టెన్సీలో దక్షిణాఫ్రికా జట్టు సెమీఫైనల్లో గట్టి ప్రత్యర్థి ఆస్ట్రేలియాను బౌలింగ్‌తో కట్టడి చేసి... బ్యాటింగ్‌తో చుట్టేసింది. జెమ్మా బోతా, లౌరెన్స్, కరబో మెసోలతో కూడిన బ్యాటింగ్ లైనప్, ఆష్లే వాన్‌విక్, ఎన్‌తబిసెంగ్ నిని, శేషిని నాయుడులతో కూడిన బౌలింగ్ దళం కూడా మెరుగ్గా ఉంది.

పిచ్, వాతావరణం

భారత్‌కు బాగా అలవాటైన పిచ్. అటు బౌలింగ్‌కు, ఇటు బ్యాటింగ్‌కు అనుకూలించే అవకాశం ఉంది. సాధారణ వాతావరణమే. వాన ముప్పు దాదాపుగా లేదు.

ఆధిక్యం కోసం ఆఖరి పోరు

ముంబై: ఇప్పటికే సిరీస్ భారత్ చేతికందింది. ఇక మిగిలిందల్లా ఆధిక్యం పెంచుకోవడమే! మూడు వన్డేల సిరీస్‌కు ముందు ఈ చివరి మ్యాచ్ గెలిచి... 4-1తో ఆధిక్యం, ఆత్మవిశ్వాసంతో వెళ్లాలని టీమిండియా భావిస్తోంది. ఇక ఇంగ్లండ్ పరిస్థితి దీనికి భిన్నం. చేజారిన సిరీస్‌తో ఒత్తిడిలో ఉన్న బట్లర్ బృందం ఇప్పుడు భారత్ ఆధిపత్యానికి గండి కొట్టాలని... ఈ పొట్టి సిరీస్‌లో ఆతిథ్య జట్టు శుభారంభమివ్వగా... విజయంతో ముగింపు తమది కావాలని ఇంగ్లండ్ జట్టు గట్టిగా ఆశిస్తోంది. ఈ నేపథ్యంలో ఆఖరి పోరులో పైచేయి సాధించేందుకు పర్యాటక జట్టు సర్వశక్తులు ఒడ్డేందుకు సిద్ధమైంది. మొత్తంమీద ఇరుజట్ల మధ్య మరో రసవత్తర పోరుకు నేడు వాంఖెడే స్టేడియం వేదిక కానుంది.

సంజూ... మెరిపించు!

ఈ సిరీస్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ ఆడాడు. తిలక్ వర్మ గెలిపించే 'షో' చేశాడు. హార్దిక్ పాండ్యా అసలైన ఆటను గత మ్యాచ్‌లో బయటికి తెచ్చాడు. అక్షర్ పటేల్ బంతితో లేదంటే బ్యాటింగ్‌తో జట్టుకు అక్కరకొస్తున్నాడు. అంతెందుకు అరకొరగా... అంటే శివమ్ దూబే 'కన్‌కషన్'తో తుది జట్టులోకి వచ్చిన హర్షిత్ రాణా కూడా మ్యాచ్ గెలిపించే బౌలింగ్ ప్రదర్శన కనబరిచాడు. కానీ టాప్-4లో ఓపెనర్ సంజూ సామ్సన్, కెప్టెన్ సూర్యకుమార్‌ల తోనే జట్టు మేనేజ్‌మెంట్ కలవరపడుతోంది. తర్వాతి ప్రపంచకప్ వేటకు కోచ్ గంభీర్ కోర్ గ్రూపులోని ఆటగాళ్లు ఇలా వరుసగా విఫలమవడం జట్టుకు ప్రతికూలంగా మారింది. బౌలింగ్‌లో అర్ష్‌దీప్, పాండ్యాలు వెన్నుదన్నుగా నిలుస్తుంటే స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఉన్నపళంగా మ్యాచ్‌ను మలుపుతిప్పే మాయాజాలంతో ఆకట్టుకుంటున్నాడు. రవి బిష్ణోయ్ కూడా ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెడుతున్నాడు.

నేడు ఇంగ్లండ్‌తో భారత్ ఐదో టి20 మ్యాచ్

- సంజూ సామ్సన్, సూర్యకుమార్‌లకు మరో అవకాశం
- ఒత్తిడిలో బట్లర్ బృందం
- రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



2-3 లక్ష్యంతో ఇంగ్లండ్

సిరీస్‌ను కోల్పోయిన ఇంగ్లండ్‌కు ఇప్పుడు ఆఖరి పంచ్ మాత్రమే మిగిలుంది. ఇందులో తమ పవర్ చాటుకొని తదుపరి వన్డే సిరీస్‌ను తాజాగా ప్రారంభించాలని బట్లర్ జట్టు అనుకుంటుంది. సాల్ట్ గత మ్యాచ్‌లో టచ్‌లోకి వచ్చినా కొద్దిసేపే క్రీజులో ఉన్నాడు. ఇప్పుడు లయను అందుకుంటే బెన్ డకెట్‌తో ఓపెనింగ్ వికెట్‌కు భారీ ఆరంభం ఇవ్వగలడు. ఇదే జరిగితే... తదుపరి పరుగుల ప్రవాహాన్ని బట్లర్, హ్యారీ బ్రూక్, లివింగ్‌స్టోన్, జాకబ్ బెథెల్, బ్రైడన్ కార్స్‌లు తీసుకెళ్తారు. ఆర్చర్, సకిబ్ మహమూద్ పేస్‌తో ఆకట్టుకుంటుండగా, స్పిన్‌తో ఆదిల్ రషీద్ నిలకడను ప్రదర్శిస్తున్నాడు.

5 వాంఖెడే మైదానంలో ఇప్పటి వరకు భారత జట్టు ఐదు టి20 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో మూడింటిలో గెలిచి, రెండింటిలో ఓడిపోయింది. చివరి మూడు మ్యాచ్‌ల్లో భారత జట్టే నెగ్గింది.

సిరీస్ చేజారినా... సమరంలో పట్టు కోల్పోరాదని ఐదో టి20లో నిరూపించుకోవాలని ఇంగ్లండ్ బృందం చూస్తోంది.

పిచ్, వాతావరణం

వాంఖెడే బ్యాటింగ్‌కు అచ్చొచ్చే పిచ్. చాలా మ్యాచ్‌ల్లో, ప్రత్యేకించి టి20ల్లో చేజింగ్ జట్లకు విజయ అవకాశాలిచ్చింది. అలాగని బౌలింగ్ తేలిపోదు. స్పిన్నర్లు ప్రభావం చూపొచ్చు. వాన ముప్పు లేదు.

బడ్జెట్‌లో క్రీడలకు రూ.3,794 కోట్లు

గతం కంటే 351.98 కోట్లు పెంపు

న్యూఢిల్లీ: భారత ప్రభుత్వం కొత్త బడ్జెట్‌లో క్రీడలు, యువజన సర్వీసుల శాఖకు రూ. 3,794.30 కోట్లు కేటాయించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆ మేరకు నిధుల్ని కేటాయించారు. గత బడ్జెట్‌లో రూ. 3442.32 కోట్లు ఇవ్వగా... తాజాగా రూ.351.98 కోట్లు పెంచింది. కేంద్ర క్రీడాశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఖేలో ఇండియా' కార్యక్రమానికే ఈ క్రీడా బడ్జెట్లో ప్రాధాన్యం దక్కింది. గతంలో రూ. 800 కోట్లు కేటాయించగా ఈసారి ఆ మొత్తాన్ని రూ. 1000 కోట్లకు పెంచింది. నికరంగా రూ. 200 కోట్లను హెచ్చింపు చేసింది. జాతీయ క్రీడా సమాఖ్యలకు ఇచ్చే గ్రాంట్లను కూడా పెంచింది. గతంలో సమాఖ్యలకు రూ. 340 కోట్లు ఇవ్వగా తాజా ఆర్థిక సంవత్సరంలో రూ. 400 కోట్లు కేటాయించారు. భారత స్పోర్ట్స్ అథారిటీకి రూ. 830 కోట్లు (గత బడ్జెట్ కంటే రూ. 15 కోట్లు అదనం) ఇవ్వనున్నారు. అథ్లెట్ల పారదర్శకత పోటీ కోసం పాటుపడుతున్న జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) లాబోరేటరీకి రూ. 23 కోట్లు (గతంలో రూ. 18.70 కోట్లు) కేటాయించింది. 1998లో ఏర్పాటు చేసిన జాతీయ స్పోర్ట్స్ అభివృద్ధి నిధి కోసం రూ. 18 కోట్లను యథాతథంగా కొనసాగించినప్పటికీ... క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహకాలకు స్వల్పంగా కోత పెట్టింది. పోయిన ఏడాది రూ. 42.65 కోట్లు ఇస్తే ఈసారి రూ. 37 కోట్లకు పరిమితం చేసింది. యువజన సర్వీసులకు భారీగా కోత పెట్టింది. గత బడ్జెట్లో రూ. 55 కోట్లు కేటాయిస్తే ఈసారి కేవలం రూ. 11.70 కోట్లే విదిలించింది. జమ్మూకశ్మీర్‌లో క్రీడా సదుపాయల కల్పన కోసం రూ. 20 కోట్లు ఇవ్వనుంది. గతం కంటే రూ. 14 కోట్లు ఎక్కువగా కశ్మీర్‌లో మౌలిక సౌకర్యాలకు వెచ్చించనుంది.

టోగోపై 2-0 ఆధిక్యంలో భారత్

న్యూఢిల్లీ: డేవిస్‌కప్ ప్రపంచ టీమ్ టెన్నిస్ వరల్డ్ గ్రూప్-1 ప్లే ఆఫ్ మ్యాచ్‌లో భారత్ శుభారంభం చేసింది. టోగో జట్టుతో శనివారం మొదలైన ఈ పోటీలో తొలి రోజు జరిగిన రెండు సింగిల్స్‌లోనూ భారత ఆటగాళ్లు ఆడుతూ పాడుతూ విజయం సాధించారు. ఫలితంగా భారత్ 2-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. తొలి సింగిల్స్‌లో శశికుమార్ ముకుంద్ 6-2, 6-1తో లియోవా (టోగో)పై నెగ్గగా... రెండో సింగిల్స్‌లో రామ్‌కుమార్ 6-0, 6-2తో సెటోడ్జి (టోగో)ను ఓడించాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో


సాక్షి సినిమా


● 'దిల్' రాజు, అనిల్ రావిపూడి, శిరీష్

ఈ సక్సెస్ చాలా పాఠాలు నేర్పింది

-'దిల్' రాజు

''ఇండస్ట్రీలో బడ్జెట్ కాదు.. కథే ముఖ్యం. మేము కూడా కథలని నమ్ముకుని సినిమాలు నిర్మించాం. కొత్త దర్శకులతో తీసినప్పుడు ఎన్ని విజయాలు వచ్చాయో అందరికీ తెలిసిందే. అయితే కాంబినేషన్స్ అంటూ నాలుగైదేళ్లుగా మేం తడబడుతున్నాం. 'సంక్రాంతికి వస్తున్నాం' హిట్‌తో అనిల్ మళ్లీ మాకు ఒక రహదారి వేసి ఇచ్చాడు. ఈ సక్సెస్ నాకు కూడా చాలా పాఠాలు నేర్పించింది'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన డిస్ట్రిబ్యూటర్స్ గ్రాటిట్యూడ్ మీట్‌లో 'దిల్' రాజు మాట్లాడుతూ- ''సాధారణంగా డిస్ట్రిబ్యూటర్స్‌కి బ్రేక్ ఈవెన్ అయితేనే సూపర్ హిట్. అయితే వాళ్లు నష్టపోయినప్పుడు కూడా సినిమా సూపర్ హిట్ పోస్టర్స్ పడుతుంటాయి. 90 శాతం ఫెయిల్యూర్స్, కేవలం 10 శాతం మాత్రమే సక్సెస్ ఉండే ఇండస్ట్రీ ఇది. 20 ఏళ్లుగా మాతో ప్రయాణం చేస్తున్న డిస్ట్రిబ్యూటర్స్‌కి ధన్యవాదాలు'' అని చెప్పారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ- ''సంక్రాంతికి వస్తున్నాం' ఆరు రోజుల్లోనే రూ.100 కోట్లు షేర్ రాబట్టింది. ఓ రీజినల్ ఫిలింకి చూడలేనేమో అనుకున్న రూ. 300 కోట్ల గ్రాస్ నంబర్ మా మూవీతో చూడబోతున్నందుకు హ్యాపీ'' అని తెలిపారు. ''20 ఏళ్ల క్రితం డిస్ట్రిబ్యూటర్‌కి ఉన్న విలువ ఇప్పుడు లేదు. ఇలాంటి సమయంలో వాళ్లు తలెత్తుకునేలా చేసిన సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం'' అని శిరీష్ పేర్కొన్నారు. డిస్ట్రిబ్యూటర్స్ సాయికృష్ణ, రాజేశ్, హరి, శోభన్, ఎల్వీఆర్ మాట్లాడారు.


● 'తంగలాన్'లో విక్రమ్


● 'గామి'లో విశ్వక్ సేన్

అరుదైన గౌరవం

విశ్వక్ సేన్ హీరోగా నటించిన 'గామి', విక్రమ్ కథానాయకుడిగా చేసిన 'తంగలాన్' సినిమాలకు అరుదైన గౌరవం దక్కింది. 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ రోటర్‌డామ్ 2025'లో ప్రదర్శనకి ఈ చిత్రాలు ఎంపికయ్యాయి. నెదర్లాండ్స్ వేదికగా ఈ నెల 9 వరకూ జరగనున్న ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారత సినిమాలకు చోటు దక్కడం విశేషం. విశ్వక్ సేన్ హీరోగా, చాందినీ చౌదరి హీరోయిన్‌గా రూపొందిన తెలుగు చిత్రం 'గామి'. ఈ చిత్రంతో విద్యాధర్ కాగిత దర్శకుడిగా పరిచయమయ్యారు. కార్తీక్ శబరీష్ నిర్మించిన ఈ చిత్రం 2024 మార్చి 8న విడుదలైంది. ఈ సినిమాలో విశ్వక్ సేన్ అఘోరాగా నటించారు. ఆయన నటనకు ప్రేక్షకుల నుంచి మంచి మార్కులు పడ్డాయి. అదే విధంగా విక్రమ్ హీరోగా నటించిన తమిళ చిత్రం 'తంగలాన్'. పా. రంజిత్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో మాళవికా మోహనన్, పార్వతీ తిరువోతు కీలక పాత్రల్లో నటించారు. కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ సినిమా 2024 ఆగస్టు 15న తమిళంతో పాటు తెలుగులోనూ విడుదలైంది. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్‌లో జరిగిన సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. ఈ సినిమాలో మరోసారి తన నట విశ్వరూపం చూపించారు విక్రమ్. ఇక 'గామి, తంగలాన్'లు 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ రోటర్‌డామ్ 2025' ప్రదర్శనకు ఎంపిక కావడంపై పలువురు అభినందనలు తెలుపుతున్నారు.

పల్లెటూరి డిటెక్టివ్


● కిశోర్ శ్రీకృష్ణ, తనికెళ్ల భరణి, మిధున ప్రియ

తనికెళ్ల భరణి ప్రధాన పాత్రలో 'అసుర సంహారం' అనే చిత్రం రూపొందనుంది. కిశోర్ శ్రీకృష్ణ దర్శకత్వం వహించనున్న ఈ సినిమాలో మిధున ప్రియ కీలక పాత్ర చేయనున్నారు. శ్రీ సాయి ప్రవర్తిక బోయళ్ల సమర్పణలో శ్రీ సాయి తేజో సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై సాయి శ్రీమంత్, శబరీష్ బోయళ్ల నిర్మించనున్న ఈ చిత్రాన్ని శనివారం ప్రకటించారు. 'క్రైమ్, సస్పెన్స్, థ్రిల్లర్ చిత్రాలకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం కాన్సెప్ట్, కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రాలకి ప్రేక్షకాదరణ ఉంటోంది. ఈ క్రమంలోనే విలేజ్ క్రైమ్ డ్రామాగా 'అసుర సంహారం' రూపొందనుంది. ఈ మూవీలో తనికెళ్ల భరణి విలేజ్ డిటెక్టివ్‌గా ఓ విభిన్నమైన పాత్రలో ప్రేక్షకులను అలరించనున్నారు. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మిధున ప్రియ, కెమేరా: బాలు ఏబీసీడీ, సంగీతం: కరీం అబ్దుల్.

స్క్రీన్స్ పెరగడం ఆనందం

- విష్ణువర్ధన్

ఆకాశ్ మురళి, అదితీ శంకర్ జంటగా 'పంజా' ఫేమ్ విష్ణువర్ధన్ దర్శకత్వంలో రూపొందిన తమిళ సినిమా 'నెసిప్పాయ'. ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ జనవరి 14న విడుదలైంది. ఈ సినిమాను 'ప్రేమిస్తావా' టైటిల్‌తో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ జనవరి 31న తెలుగులో విడుదల చేసింది. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం సక్సెస్‌మీట్‌లో ఆకాశ్ మురళి మాట్లాడుతూ-''తెలుగు పరిశ్రమకు నన్ను ఆహ్వానించిన ప్రేక్షకులకు థ్యాంక్స్. మా సినిమా తెలుగు ప్రేక్షకులకూ నచ్చడం హ్యాపీగా ఉంది'' అన్నారు. ''రిలేషన్‌షిప్ నేపథ్యంలో జరిగే రొమాంటిక్ డ్రామా ఇది. ఈ సినిమాలోని క్రైమ్ ఎలిమెంట్ అందర్నీ సర్‌ప్రైజ్ చేస్తుంది. ఆకాశ్ ప్రతిభగలవాడు. యాక్షన్ స్టంట్స్‌ను కూడా తనే చేశాడు. అదితి అద్భుతంగా నటించింది. 'ప్రేమిస్తావా' సినిమాకు స్క్రీన్స్ పెరుగుతున్నాయని మైత్రీవారు చెప్పడం హ్యాపీగా ఉంది'' అని చెప్పారు విష్ణువర్ధన్. ''ఈ సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు సహనిర్మాత స్నేహ.


● విష్ణువర్ధన్, ఆకాశ్ మురళి, స్నేహ

సస్పెన్స్


● ఆర్పీ పట్నాయక్, సురేష్

రాంప్రసాద్, జెమినీ సురేష్, కిరీటి, సాయి ప్రసన్న, సాయి కిరణ్, నజియా ఖాన్, అద్వైత చౌదరి ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'వైఫ్ ఆఫ్ అనిర్వేష్'. గంగ సప్తశిఖర దర్శకత్వం వహించారు. మహేంద్ర గజేంద్ర సమర్పణలో వెంకటేశ్వర్లు మెరుగు, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మించారు. ఈ సినిమా ఎస్‌కేఎంఎల్ మోషన్ పిక్చర్స్ ద్వారా తెలుగులో రిలీజ్ కానుంది. ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను దర్శకుడు, మ్యూజిక్ డైరెక్టర్ ఆర్పీ పట్నాయక్ విడుదల చేసి, మాట్లాడుతూ- ''అద్భుతమైన స్క్రీన్‌ప్లేతో రూపొందిన ఈ సస్పెన్స్ థ్రిల్లర్ మంచి విజయం సాధిస్తుంది'' అన్నారు. వెంకటేశ్వర్లు మెరుగు, శ్రీ శ్యామ్ గజేంద్ర మాట్లాడుతూ-''ఓ మిమిక్రీ ఆర్టిస్ట్ తన ఇబ్బందులను తనకు తెలిసిన కళతో ఎలా పరిష్కరించాడు? అనేది దర్శకుడు ఆసక్తిగా తెరకెక్కించారు'' అని తెలిపారు.

సూర్యాపేట్ నేపథ్యంలో....



● ఈశ్వర్, నైనా

'కొత్తగా మా ప్రయాణం' మూవీ ఫేమ్ ఈశ్వర్ హీరోగా, నైనా సర్వర్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'సూర్యాపేట్ జంక్షన్'. రాజేశ్ నాదెండ్ల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అభిమన్యు సింగ్ ప్రధాన పాత్ర పోషించారు. అనిల్‌కుమార్ కాట్రగడ్డ, ఎన్. శ్రీనివాసరావు నిర్మించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ట్రైలర్ విడుదల వేడుకలో ఈశ్వర్ మాట్లాడుతూ- ''సూర్యాపేట్ జంక్షన్'కి నేను కథ రాశాను. సూర్యాపేట పరిసరాల్లో జరిగే కథ ఇది. ప్రభుత్వం నుంచి ఉచితాలు తీసుకోవడం వల్ల మధ్య తరగతి ప్రజలు ఎలాంటి ఇబ్బందుల్లో ఇరుక్కుంటున్నారో మా చిత్రంలో చూపిస్తున్నాం'' అన్నారు. ''మా సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. రోషన్ సాలూరి, గౌర హరి మంచి సంగీతం ఇచ్చారు'' అన్నారు అనిల్ కుమార్.

ఓటీటీ ఇది చూడొచ్చు

చూసి తెలుసుకోదగ్గ డాక్యుమెంటరీ

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో బాలీవుడ్ చిత్రం ది రోషన్స్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఈ జీవితమనే చక్రంలో కొందరి వంతు వస్తుంది, కొందరి వంతు ముగుస్తుంది. ముగిసిన వారి జ్ఞాపకాలు మన మనసులో పదిలంగా ఉంటాయి. వారిలో ఎందరో మహానుభావులుంటారు. వారి జ్ఞాపకాలైతే మనం నెమరువేసుకోవచ్చేమో కానీ ఆ కాలంలో వారు పడ్డ కష్టం, ఆనందం కానీ మనకు తెలియవు. అటువంటి వారి జీవిత చక్రానికి వెండి తెర రూపమిస్తే మన ఆనందం అవధులు దాటుతుంది. ఆ కోవకు చెందినదే నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమ్ అవుతున్న 'ది రోషన్స్' టీవీ షో. ఇదో డాక్యుమెంటెడ్ మినీ సిరీస్. ఒకే కుటుంబానికి చెందిన నలుగురి జీవిత చక్రాలకు తెర రూపమే ఈ షో. బాలీవుడ్ దిగ్గజ రోషన్ కుటుంబానికి చెందిన నాటి సంగీత కళాకారులు రోషన్ లాల్ నాగ్రత్ నుండి నేటి తరం నటుడు హృతిక్ రోషన్ వరకు... వారి జీవిత ప్రయాణాన్ని ఎంతో అందంగా చూపించారు ఈ డాక్యుమెంటరీలో. ఓ రకంగా చెప్పాలంటే మనం ఈ షో ద్వారా నాలుగు తరాలు ప్రయాణిస్తాం. ముందుగా రోషన్ కుటుంబం నుండి రోషన్ లాల్ నాగ్రత్ సంగీత ప్రయాణంతో ఈ షో ప్రారంభమై ఆ పై అతని కొడుకు రాజేష్ రోషన్ బాలీవుడ్ ప్రయాణంతో సాగి, ఆ తరువాత ఆయన కొడుకు రాకేశ్ రోషన్ నటనా ప్రయాణంతో పాటు ప్రొడ్యూసర్‌గా ఎలా రాణించారు? అన్నది చూపిస్తూ నేటి తరం కథానాయకుడు హృతిక్ రోషన్ బాలీవుడ్ ప్రయాణంతో షో ముగుస్తుంది. ఈ షో ద్వారా నాటి బాలీవుడ్ సంగీతం నుంచి నేటి తరం సినిమాల వరకు మనకు తెలియని ఎన్నో రహస్యాలతో పాటు హిందీ చిత్ర పరిశ్రమలోని అప్పటి ఒడిదుడుకులను ఇప్పటి పట్టు విడుపులను సవివరంగా చూపించారు. ఈ రోషన్ కుటుంబానికి బాలీవుడ్ పరిశ్రమలో ఉన్న నాటి, నేటి దిగ్గజాలు తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ప్రేక్షకులకు చెప్పడం మరింత బావుంది. అందుకే 'ది రోషన్స్' చూసి నేర్చుకోదగ్గ, తెలుసుకోదగ్గ డాక్యుమెంటరీ. ఇది ప్రతి సినిమా ప్రేక్షకుడు తమ వ్యక్తిగత లైబ్రరీలో భద్రపరుచుకోదగ్గ డాక్యుమెంటెడ్ మినీ సిరీస్. వర్త్‌ఫుల్ టు వాచ్.

- ఇంటూరు హరికృష్ణ